Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 192 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 2 ఆగస్టు 2023 | బుధవారం | పేజీలు : 4

## శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట

బెంగళూరు : కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన ఉన్నారన్న ఆరోపణలపై కేసు దర్యాప్తు జరపకుండా హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై సీబీఐ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా...జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. ఇదిలా ఉండగా, లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ కోసమే కాంగ్రెస్ అగ్రనేతలు తమను ఢిల్లీకి పిలిచారని శివకుమార్ స్పష్టం చేశారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన మంత్రులు, సీనియర్ నేతలతో కలిసి బుధవారం ఢిల్లీకి వెళుతున్నామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో నాయకులందరికీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులను ఎలా ఎంపిక చేయాలి, మంత్రులు లేదా సీనియర్ నేతలకు టికెట్లు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించే అవకాశం ఉందని అన్నారు.




## పెండింగ్ బిల్లులపై గవర్నర్ తమిళిసై మరోసారి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణలో పెండింగ్ బిల్లుల వ్యవహారంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య గత కొద్దిరోజులుగా విభేదాలు నడుస్తూనే ఉన్నాయి. పలు బిల్లులను గవర్నర్ పాస్ చేయలేదని తెలంగాణ సర్కార్ ఏకంగా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. మొత్తం 10 బిల్లులకు గాను.. మూడింటికి గవర్నర్ ఆమోదముద్ర వేశారు. రెండు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపగా.. మరో రెండు బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరారు. మిగిలిన మూడు బిల్లుల్లో ఒక బిల్లును తిరస్కరించారు.

మరో రెండు బిల్లులపై అదనపు వివరణ కోసం తిరిగి ప్రభుత్వానికి పంపించారు. దీంతో గవర్నర్ తీరుపై ప్రభుత్వం నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో తాజాగా పెండింగ్ బిల్లులపై గవర్నర్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.

"నేను ఎవరికీ వ్యతిరేకం కాదు - బిల్లులు ఎందుకు తిరస్కరించానో కారణాలు చెప్పాను. బిల్లులను తిప్పి పంపడం నా ఉద్దేశం కాదు. ప్రభుత్వం కావాలని నన్ను బాదునాం చేస్తే నేను బాధ్యురాలని కాను. నేను రాజకీయమైన యాక్టింగ్ చేయడం లేదు.. నేను చెప్పిన కారణాలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూద్దాం" అంటూ గవర్నర్ తమిళిసై వ్యాఖ్యలు చేశారు.

**వారిని చూస్తుంటే బాధేస్తోంది...** అకాల వర్షాలపై గవర్నర్ మాట్లాడుతూ... అకాల వర్షాల వల్ల తెలంగాణ ప్రజల ఇబ్బందులు బాధ కలిగించాయన్నారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను చూస్తుంటే బాదేస్తోందన్నారు. ప్రభుత్వం మరింత మెరుగ్గా ప్రజలకు రక్షణగా ఉండాల్సింది అని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అండగా ఉండాలని, రిమోట్ ఏరియా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలపై కొన్ని రాజకీయ పార్టీలు మెమోరాండం ఇచ్చాయన్నారు. హైదరాబాద్ జల్పల్లి ఏరియా వర్షాలు వల్ల ఎఫెక్ట్ అయిందన్నారు. నీట మునిగిన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉండాలని ఆదేశించారు. వర్షాలపై ప్రభుత్వాన్ని నివేదిక అడిగానని.. అది వచ్చిన వెంటనే కేంద్రానికి పంపుతానని చెప్పారు. వరద బాధిత ప్రాంతాల్లో త్వరలో పర్యటించనున్నట్లు గవర్నర్ తమిళిసై ప్రకటించారు.




## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన మరుసటి రోజే చార్జీల బాదుడు షురూ..

హైదరాబాద్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన మరుసటి రోజే చార్జీల బాదుడును అధికారులు షురూ చేశారు. సిటీలో డే బస్ పాస్ చార్జీలను టీఎస్ఆర్టీసీ పెంచింది. 100 రూపాయలున్న డే పాస్ ను 120 కు పెంచింది. గతంలో మహిళలు, సీనియర్ సిటిజన్స్ కు 80 రూపాయలున్న డే పాస్ ఇప్పుడు 100 రూపాయలుగా ఉంది. 80 , 100 రూపాయలు ఉన్నప్పుడు డే పాస్ కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. రూ.120 డే పాస్ సమయంలో రోజుకి 25 వేలు మాత్రమే అమ్మకం జరిగింది. రూ.80 రూపాయల డే పాస్ సమయంలో రోజుకీ 40 వేల వరకూ అమ్మేవారు. మళ్లీ పెరిగిన టికెట్ ధరలతో బాదుడు మొదలైందని ప్రయాణికులు చెబుతున్నారు. కాగా.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నిర్ణయించింది. ఆర్టీసీ సిబ్బంది దీర్ఘకాలికంగా చేస్తున్న పలు డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో పని చేస్తున్న 43,373 మంది కార్మికులు ఇక ప్రభుత్వ ఉద్యోగులు కానున్నారు. సోమవారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఐదు గంటలపాటు సుదీర్ఘంగా జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన నష్టానికి తక్షణ సాయంగా రూ.500 కోట్లు విడుదల చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది.



## ఆగస్టు 8న 'అవిశ్వాసం'పై పార్లమెంట్‌లో చర్చ..

దిల్లీ: విపక్ష ఎంపీలు ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు తేదీలు ఖరారయ్యాయి. ఆగస్టు 8 నుంచి మూడు రోజుల పాటు చర్చ జరగనుంది. ఆగస్టు 10వ తేదీన ప్రధాని మోదీ మాట్లాడతారని స్పీకర్ వెల్లడించించారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈశాన్య రాష్ట్రం మణిపుర్‌లో జాతుల మధ్య వైరం జరుగుతోంది.

దానిపై ప్రకటన చేసేందుకు మోదీ పార్లమెంట్‌కు రావాలని గత కొద్దిరోజులుగా విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలోనే విపక్షాలు అవిశ్వాస అస్త్రాన్ని ఉపయోగించాయి.

# చారిత్రక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

## భారాస శ్రేణులకు కేటీఆర్ పిలుపు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుందని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భారాస నిర్ణయించింది. వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేయడం, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, హైదరాబాద్ పరిధిలో భారీగా మెట్రో విస్తరణ తదితర అంశాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో ఎక్కడికక్కడ సంబరాలు నిర్వహించాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అద్భుత నిర్ణయాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగుల పట్ల ఎంతో ఔదార్యంతో తీసుకున్న నిర్ణయాలను ఆయా వర్గాల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తాజాగా 21వేల మంది వీఆర్ఏలు, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తెలంగాణ ప్రభుత్వ మానవీయతను చాటుకుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బస్సు డిపోల ముందు ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి సంబరాలు నిర్వహించాలని పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. అటు వీఆర్ఏల కుటుంబాలు.. ఇటు ఆర్టీసీ కార్మికుల కుటుంబాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు సూచించారు.

# బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటిద్దామనుకున్న కేసీఆర్‌కు బిగ్ జలక్..!




## నెలాఖరులోగా 28 మంది ఎమ్మెల్యేలు ఔట్!?

**హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీఆర్ఎస్‌లో నరాలు తెగేంత టెన్షన్ మొదలైంది. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి..! ఈ నెలాఖరులోగా 28 మంది ఎమ్మెల్యేలపై వేటు పడుతుందనే వార్త.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.!. తెలంగాణ హైకోర్టులో మొత్తం 28 మంది ఎమ్మెల్యేల ఎన్నిక చెల్లదంటూ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. 2018 లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ పిటిషన్‌లన్నీ దాఖలవ్వగా.. ఇప్పుడిప్పుడు ఒక్కొక్కటిగా పిటిషన్‌లు కదులుతున్నాయి. అయితే ఎన్నికలు దగ్గర్లోనే ఉండటం, అన్నీ అనుకున్నట్లు జరిగితే ఆగస్టు-18న 80 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ప్రకటించాలని కేసీఆర్ ముహూర్తం కూడా ఫిక్స్ చేయడం.. ఇవన్నీ చకచకా చక్కబెట్టాలని గులాబీ బాస్ అనుకుంటున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో న్యాయస్థానాల నుంచి బిగ్ ఝలక్‌లు బీఆర్ఎస్‌కు తప్పట్లేదు.**

ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 28 మంది ఎమ్మెల్యేల ఎన్నిక చెల్లదంటూ 2018 నుంచి తెలంగాణ హైకోర్టులో పిటిషన్‌లు వేయడం జరిగింది. ఇన్నాళ్లుగా అంతా ప్రశాంతంగా ఉన్నారు.. ఎవరి నియోజకవర్గంలో వారు పనులు చేసుకున్నారు కానీ.. ఎప్పుడైతే కొత్తగూడెం ఎమ్మెల్యే వనామా వెంకటేశ్వరరావు ఎన్నికపై తీర్పు వచ్చిందో అప్పట్నుంచీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో అలజడి మొదలైంది. తెలంగాణ హైకోర్టులో మొత్తం 30 కు పైగా పెండింగ్ పిటిషన్‌లు ఉండగా.. అందులో 28కు పైగా పిటిషన్‌లు అధికార పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేల పైనే కావడం గమనార్హం. ఆగస్ట్ 12 నుంచి 17 వరకూ క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. రానున్న రోజుల్లో మరికొందరు నేతల ఎలక్షన్ పిటిషన్‌లు విచారణకు రానున్నాయని తెలుస్తోంది. మొత్తమ్మీద చూస్తే.. ఈనెలాఖరుకల్లా మొత్తం 28 మంది ఎమ్మెల్యేల లెక్కలు తేలిపోనున్నాయట. ఇప్పటికే ఒకరిపై వేటుపడగా.. మరో 28 మందిపై నెలాఖరుకల్లా వేటుపడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

**ఎవరెవరిపై పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి..?**

గద్వాల్ :- కృష్ణమోహన్ రెడ్డి - డీకే అరుణ, మహబూబ్‌నగర్ :- శ్రీనివాస్ గౌడ్ - చంద్రశేఖర్, పటాన్ చెరు :- మహిపాల్ రెడ్డి - కాట శ్రీనివాస్ గౌడ్, అసిఫాబాద్ :- ఆత్రం సక్కు - కోవా లక్ష్మి, ఖైరతాబాద్ :- దానం నాగేందర్ - దాసోజు శ్రవణ్, వేములవాడ :- చెన్నమనేని రమేష్ బాబు - ఆది శ్రీనివాస్, సికింద్రాబాద్ :- పద్మారావు - కాసాని జ్ఞానేశ్వర్, కొడంగల్ :- పట్నం నరేందర్ రెడ్డి - రేవంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం :- మంచిరెడ్డి కిషన్ రెడ్డి - మల్‌రెడ్డి, కొత్తగూడెం :- వనామా వెంకటేశ్వరరావు - జలగం వెంకట్రావు, మంచిర్యాల :- ప్రేమ్‌సాగర్ రావు - దివాకర్ రావు, హుస్నాబాద్ :- సతీష్ - చాడ వెంకటరెడ్డి, తుంగతుర్తి :- గ్యాదరి కిషోర్ - అద్దంకి దయాకర్ దేవరకద్ర :- ఆల వెంకటేశ్వర్ రెడ్డి - పవన్ కుమార్, వరంగల్ ఈస్ట్ :- నరేందర్ - రవీందర్, ఆలేరు :- గొంగడి సునీత - సతీష్ జూబ్లీహిల్స్ :- మాగంటి గోపీనాథ్ - విష్ణువర్ధన్ రెడ్డి, మల్కాజ్‌గిరి :- మైనంపల్లి హన్మంత్ - రామచందర్ రావు, కరీంనగర్ : గంగుల కమాలకర్ - బండి సంజయ్, ధర్మపురి :- కొప్పుల ఈశ్వర్ - అడ్లూరి లక్ష్మణ్, కోదాడ :- బొల్లం మల్లయ్య - ఉత్తమ్ పద్మావతి, నాగర్‌కర్నూల్ :- మర్రి జనార్ధన్ - నాగం జనార్ధన్, గోషామహల్ :- రాజాసింగ్ - ప్రేమ్‌సింగ్ రాథోడ్, వికారాబాద్ :- మెతుకు ఆనంద్ - గడ్డం ప్రసాద్ పరిగి :- మహేశ్వర్ రెడ్డి - రామ్మోహన్ రెడ్డి, జనగాం :- ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి - పొన్నాల లక్ష్మయ్య, నాంపల్లి :- జాఫర్ హుస్సేన్ - ఫిరోజ్ ఖాన్

**టికెట్లు కష్టమేనా..? :** పైన చెప్పిన వారికి సంబంధించి పిటిషన్‌లన్నీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అయితే చాలా మంది కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసిన అభ్యర్థులు ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే శ్రీనివాస్ గౌడ్‌పై ఎలక్షన్ పిటిషన్‌లో ట్రయల్ ప్రారంభమైంది. బుధవారం నాడు కొప్పుల ఈశ్వర్ పై దాఖలైన ఎన్నికల పిటిషన్ పై విచారణ జరగనుంది. మొత్తానికి చూస్తే వనామా అనర్హత వేటుతో బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన మొదలైంది.

ఈ నెలాఖరులోపు ఎంతమందిపై వేటు పడుతుందో..? ఈ మొత్తం వ్యవహారంపై కేసీఆర్ సర్కార్ ఎలా ముందుకెళ్తుంది..? ఒకవేళ ఈ నెలాఖరుకల్లా క్లియర్ కాకపోతే రానున్న ఎన్నికల్లో ఈ ఎమ్మెల్యేలకు మళ్లీ కేసీఆర్ టికెట్లు ఇస్తారా..? లేకుంటే పక్కనెట్టేస్తారా..? అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. ఏం జరుగుతుందో చూడాలి మరి.

# సంపాదకీయం

## విడిపోయాక కూడా ఈ మాటల మంటలు అవసరమా?

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం ఏపీ తెలంగాణ నేతల మధ్య చిచ్చు రాజేసిన సంగతి తెలిసిందే. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా తాము ఆసక్తి వ్యక్తీకరణ కోసం బిడ్డు దాఖలు చేస్తామని కొద్ది రోజుల క్రితం తెలంగాణ మంత్రులు ప్రకటించారు. కొద్ది రోజుల్లో సింగరేణి నుంచి నిపుణుల బృందం స్టీల్ ప్లాంట్ ను సందర్శిస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆంధ్రాలో ఆయా పార్టీల నేతలకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ మంత్రులు నేతల వ్యాఖ్యలపై వైసీపీ నేతలు కూడా ఘాటు విమర్శలు చేశారు. బొత్స సత్యనారాయణ కారుమూరి నాగేశ్వరరావు సీదిరి అప్పలరాజు పేర్ని నాని తదితరులు బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ఈ క్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే చేసిన వ్యాఖ్యలు ఈ చిచ్చును పెంచడానికి మరింత ఆజ్యం పోశాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయాలనుకోవడం లేదని ఆయన తాజాగా విశాఖ పర్యటనలో వ్యాఖ్యానించారు. దీంతో కేటీఆర్ హరీష్ రావు.. కేసీఆర్ దెబ్బకు కేంద్రం దిగివచ్చిందని.. ఏపీలో బీఆర్ఎస్ సాధించిన తొలి విజయం ఇదంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్ హరీష్ వ్యాఖ్యలపై వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కానన్నట్టు బీఆర్ఎస్ నేతల వ్యవహారం ఉందని మండిపడ్డారు. చంద్రబాబులాగా మామను వెన్నుపోటు పొడవటానికి హరీష్ రావు సిద్ధంగా ఉన్నాడని విమర్శించారు. ఇక పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. బీఆర్ఎస్ నేతలు ప్రాంతీయ ఉన్మాదులని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో మెజారిటీ పెట్టుబడులు ఏపీ వారివేనని తెలిపారు. ఇప్పటికీ నిధులు నీళ్ల విషయంలో ఏపీ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మంత్రి సీదిరి అప్పలరాజుకు ఫోన్ వెళ్లినట్టు.. ఇలా తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఏమిటని తలంటినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయినా రెండు రాష్ట్రాలు విడిపోయి ఎవరి పాలన వారు సాగించుకుంటున్నాయి. ప్రజలు కూడా విడిపోయినా అన్నదమ్ముల్లానే జీవిస్తున్నారు. అయితే రెండు రాష్ట్రాల్లో అధికార పార్టీలు.. బీఆర్ఎస్ వైసీపీ నేతలు మాత్రం మాటల తూటాలను వదులుతూ మరోమారు విద్వేషాలను పెంచుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కేసీఆర్ కు జగన్ జగన్ కు కేసీఆర్ సహకరించుకోవడంలో భాగంగానే ఇదంతా జరుగుతుందనే వ్యాఖ్యానాలు కూడా వినవస్తున్నాయి. భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్ధి పొందడంలో కేసీఆర్ తర్వాత ఎవరైనా అని.. దానికి తగ్గట్టే వైసీపీ నేతల వ్యవహారం ఉందని అంటున్నారు. నేతల మధ్య మాటల తీవ్రత తగ్గాల్సిన అవసరం ఉందని.. ప్రజల మధ్య మరోమారు విభేదాలు సృష్టించే ప్రయత్నాలు వద్దని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# మీసేవ తప్పుడు తోవ!

వరంగల్ : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతోపాటు ప్రభుత్వ సేవలను, సర్వీసులను ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందించేందుకు 2011లో ఏర్పాటుచేసిన మీసేవ కేంద్రాలు పెడతోవపడుతున్నాయి. ప్రతి సర్వీసుకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా దగ్గర్లోని ఈ కేంద్రాల ద్వారా సుమారు 150 వరకు సేవలు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా కుల, ఆదాయ, నివాసం తదితర ఏ సర్వీసుకైనా ప్రభుత్వం రూ.45 నిర్ణయించింది. ప్రజల అవసరాన్ని బట్టి ఈ కేంద్రాల నిర్వాహకులు వసూళ్లకు తెరలేపుతున్నారు. ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.300 నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు.

పర్యవేక్షణను గాలికొదిలేసి

జిల్లాల్లోని మీసేవ, టీఎస్ ఆన్‌లైన కేంద్రాలు ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఈడీఎం) పర్యవేక్షణలో పనిచేస్తుంటాయి. ఈ కేంద్రాలకు ప్రత్యేకంగా జిల్లా మేనేజర్లు ఉంటారు. పారదర్శకంగా ప్రజలకు సేవలందించేందుకు వారు మీసేవ కేంద్రాలను సందర్శించడంతో పాటు వాటి నిర్వాహకులతో ప్రతి 6 నెలలకోసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. మండల స్థాయిలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు.. మీసేవ కేంద్రాలు అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే.. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకునే అవకాశముంది. క్షేత్రస్థాయిలో మాత్రం పూర్తి వ్యతిరేకంగా జరుగుతోంది. మీసేవ కేంద్రాల పనితీరును అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల కొన్ని కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలకు సంబంధించి కొందరు బాధితులు నేరుగా మండల తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు వరంగల్ డిప్యూటీ తహశీల్దార్ రేణుక చెప్పారు. వారు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో.. ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయామని ఆమె పేర్కొన్నారు.

ఆన్‌లైన్ కేంద్రాల్లోనూ..

ప్రారంభంలో జిల్లా స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించి నిరుద్యోగులకు మీసేవ కేంద్రాలను మంజూరుచేశారు. జిల్లా యంత్రాంగం ఎంపికైన వారికి, వారి సహాయకులకు రెండు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు కేటాయించడంతో పాటు బయోమెట్రిక్ విధానంలో మీసేవ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యే అవకాశముండేది. క్రమంగా బయోమెట్రిక్ స్థానంలో ఓటీపీ విధానాన్ని అమలుచేశారు. దీంతో రిజిస్టర్ నంబరు ఉన్న ఎవరైనా పోర్టల్‌లో లాగిన్ అయ్యే అవకాశముంది. ఇదే అదనుగా కొంతమంది కేంద్రాలను ఇతరులకు విక్రయించడం.. అద్దెకివ్వడం పరిపాటిగా మారింది. ఇదే రీతిన టీఎస్ ఆన్‌లైన్, సీఎస్సీ కేంద్రాలను నడుపుతున్న కొంతమంది దళారుల చేతుల్లోకి వెళ్లిన ఈ కేంద్రాల్లో పెద్దఎత్తున అక్రమ వసూళ్లు జరుగుతున్నాయి. ఏకంగా మండల తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసే సిబ్బందితో వ్యవహారమంతా నడిపిస్తూ.. వచ్చిన లాభంలో వాటాలు పంచుకుంటున్నారు.

దరఖాస్తుకు రూ.50.. ధ్రువపత్రానికి రూ.600

ఒ.దినేశ్, కాశీబుగ్గ, వరంగల్

త్వరగా ధ్రువీకరణ పత్రాలు ఇస్తారనే సమాచారంతో కుల ధ్రువీకరణ పత్రం కోసం వరంగల్ ఎల్బీనగర్‌లోని ఓ టీఎస్ ఆన్‌లైన్ కేంద్రానికి వెళ్లాను. కేంద్రం నిర్వాహకుడు దరఖాస్తుకు రూ.50, ధ్రువీకరణ పత్రం కోసం రూ.600 చెల్లించమన్నారు. సాయంత్రంలోగా ధ్రువీకరణ పత్రం అందజేస్తానన్నారు. కేవలం దరఖాస్తు కోసమే అయితే ఇతర మీసేవ కేంద్రాలకు వెళ్లమన్నాడు.

ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు- శ్రీవత్స కోట, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్

మీసేవ కేంద్రాల్లో ధ్రువపత్రాల జారీ సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ తీసుకున్నట్లు నిర్ధారణ అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ కేంద్రాల లైసెన్స్ రద్దుచేస్తాం. ధ్రువపత్రాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన వారిపై బాధితులు నేరుగా కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల్లో రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటాం.

# కొలువు.. నిట్‌లో సులువు!!




వరంగల్ : వరంగల్ జాతీయ సాంకేతిక విద్యా సంస్థలో ఆకర్షణీయ వేతనాలతో కొలువులు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. ఈ ఏడాది 1050 మందికి ఉద్యోగాలు దక్కాయి. వచ్చే మార్చి వరకు ఎంపిక ప్రక్రియ జరగనున్న నేపథ్యంలో వీరి సంఖ్య మరింత పెరగనుంది. ఎంటెక్ విద్యార్థులు ప్రస్తుతం బయట కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. వారిని కంపెనీలు ఎంపిక చేసుకునే వీలుంది. దేశంలోని నిట్లలో వరంగల్‌కు మంచి గుర్తింపు ఉంది. కొందరు విద్యార్థులు ఐఐటీల్లో సీట్లు వచ్చినా కాదనుకొని ఇక్కడ సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లను ఏరికోరి ఎంపిక చేసుకుంటారు. ఇందులో సీటు వస్తే కొలువు ఖాయమని విద్యార్థులు భావిస్తున్నారు. ఏటా ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు పొందుతున్న వారి సంఖ్య పెరగడం శుభ పరిణామం. గత సంవత్సరం వెయ్యి మంది ఉద్యోగాలు పొందగా, అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ. 62.5 లక్షలు. ఈ ఏడాది డిసెంబరు పూర్తి కాకముందే 1050 మంది ఎంపికైనట్లు నిట్ 'సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్' అధికారి డేవిడ్‌సన్ తెలిపారు. సగటు ప్యాకేజీ రూ. 19.5 లక్షలు ఉందన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆదిత్య సింగ్ అనే దిల్లీకి చెందిన విద్యార్థికి రూ.88 లక్షల ప్యాకేజీ దక్కింది.తెలుగు విద్యార్థులూ సత్తా చాటుతున్నారు. సుశిత్‌రెడ్డి(సీఎస్ఈ) రూ. 62.75 లక్షలు, లిఖిత(ఈసీఈ) రూ. 51 లక్షలు, అభితారావు, రుచితరెడ్డికి రూ. 29 లక్షల చొప్పున ప్యాకేజీలు దక్కాయి. ఉద్యోగాలకు అర్హులైన వారు సుమారు 1500 మంది వరకు ఉండగా, వీరిలో కొందరు ఉన్నత చదువులకు ప్రాధాన్యం ఇస్తుండగా, మరికొందరు సొంత అంకుర సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

నైపుణ్యాల పెంపు

నిట్లో నాణ్యమైన బోధన, పరిశోధనపై దృష్టి పెట్టడం వల్లే విద్యార్థులు కొలువులు సాధిస్తున్నారనని డైరెక్టర్ ఆచార్య ఎన్.వి.రమణారావు చెబుతున్నారు. ఇప్పుడు ఉద్యోగాలకు ఎంపికవుతున్న వారు కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ తరగతులే విన్నారు. అధ్యాపకులు పాఠాలను తగ్గించకుండా ప్రత్యక్ష తరగతుల్లో బోధించినట్టు ఆన్‌లైన్‌లోనూ పూర్తి సమయం కేటాయించడం వల్లే మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ ఏడాది ఆర్థిక మాంద్యంతో పాత కంపెనీలు ఎంపిక కోసం రాకున్నా, నిట్ ప్లేస్‌మెంట్ విభాగం వారు కొత్త సంస్థలను ఆహ్వానించారు. విద్యార్థులు సైతం తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకొంటున్నారు. మంచి వేతనాలు పొందేందుకు కావాల్సిన విధంగా ముందు నుంచే సిద్ధమవుతున్నారు. రోబోటిక్స్, మెషిన్ లెర్నింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ క్లబ్బుల ఏర్పాటుతో పాటు, వేసవి సెలవుల్లో కళాశాల స్థాయిలో కోడింగ్ కాంపిటీషన్లు పెట్టుకొంటూ తమ బుర్రలకు పదును పెడుతున్నారు.

ఎంపిక చేసుకోవడానికి వస్తున్న కంపెనీలు

ప్రభుత్వ రంగ సంస్థలు: బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, సి-డాక్, బీహెచ్ఈఎల్, గెయిల్ ఐటీ రంగ సంస్థలు: మైక్రోసాఫ్ట్, విప్రో, టీసీఎస్‌తోపాటు, అనేక విదేశీ బహుళజాతి సాఫ్ట్‌వేర్ కంపెనీలు.ఈకామర్స్ తరహాలో: ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌బీమా, బ్యాంకింగ్, విద్యా రంగ, అంకుర సంస్థలు

కొత్త కంపెనీలను ఆహ్వానిస్తున్నాం- డాక్టర్ ఎంజే దేవిడ్‌సన్, సీసీపీటీ అధికారి

వచ్చే ఏడాది మార్చి వరకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. మాంద్యం ప్రభావంతో గతంలో వచ్చిన కంపెనీలు రాలేదు. వెంటనే కొత్త సంస్థలను పిలిచాం. తెలుగు విద్యార్థులకు కూడా మేటి ప్యాకేజీలు దక్కాయి.

బోధనలో రాజీ ఉండదు- రుచితరెడ్డి, ఈసీఈ

నాకు రూ. 29 లక్షల వార్షిక ప్యాకేజీ దక్కింది. హైదరాబాద్‌లో ఒక కంపెనీలో ఎంపికయ్యా. కొవిడ్ సమయంలోనూ ఆన్‌లైన్ తరగతులను అధ్యాపకులు రాజీ లేకుండా బోధించారు. మా నైపుణ్యాలకు ఎప్పటికప్పుడు సానపట్టుకుంటూ సిద్ధం కావడం వల్లే మంచి వేతనాలు దక్కుతున్నాయని భావిస్తున్నా.సీనియర్ల నుంచి తెలుసుకున్నాంసుశిత్‌రెడ్డి, సీఎస్ఈనాకు రూ. 62.75 లక్షల ప్యాకేజీ దక్కడం సంతోషంగా ఉంది. అధ్యాపకుల సహకారం, సీసీపీటీ కేంద్రం చొరవ వల్ల మాకు మంచి అవకాశాలు దక్కుతున్నాయని భావిస్తున్నాం. కంపెనీలు ఎంపిక చేసే ముందు సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం.

అందుకే ఎంపిక చేసుకుంటాం- వరుణ్, ప్రొడక్ట్ మేనేజర్, సారస్ అనలిటిక్స్, హైదరాబాద్‌నేను ఎన్ఐటీ పూర్వ విద్యార్థినే. హైదరాబాద్‌లో పనిచేస్తున్నా. మా కంపెనీలోకి విద్యార్థులను ఎంపిక చేసుకోవడానికి వచ్చా. ఇక్కడ బోధన ప్రమాణాలు బాగా తెలుసు. ఈ సంస్థలో సీటు వచ్చిందంటేనే విద్యార్థులకు మంచి తెలివితేటలు ఉంటాయి. ఉద్యోగాల్లో బాగా రాణిస్తారని ఆకర్షణీయ వేతన ప్యాకేజీలు కంపెనీలు ఇస్తాయి

# రైతుబంధు నమోదుకు అవకాశం

జగిత్యాల : ప్రస్తుత యాసంగికి రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించే రైతుబంధు పథకం నిధులను 28 నుంచి విడుదల చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో మొత్తం 2,31,151 పట్టాదారులుండగా వానాకాలంలో 2,13,296 మందికి నిధులందాయి. మరణించినవారి వివరాలను జాబితా నుంచి తొలగించటం, వ్యవసాయ భూములను పూర్తిగా విక్రయించినవారు, నూతనంగా భూముల కొనుగోలు, విరాసత్ ద్వారా పట్టామార్పిడి చేయించుకున్నవారు సకాలంలో పథకం పరిధిలోకి రాకపోవటం, వివాదాలు, వ్యవసాయేతర భూములు తదితర కారణాలతో లబ్ధిదారుల సంఖ్య ఏ సీజన్‌లోనూ గరిష్ఠ స్థాయికి చేరటంలేదు. కాగా ఈ సీజనుకుగాను నిధుల పంపిణీకి ఈ నెల 20 లోపు పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారిని పరిగణనలోకి తీసుకోనున్నారు. జిల్లాలో 6,468 మంది నూతన పట్టాదారులు ఉండగా వీరితోపాటుగా గత సీజన్లలో వివరాలివ్వనివారు 766 మంది, వివరాలిచ్చినా సరిగాలేక నిధులు జమగానివారు 640 మంది ఉన్నారు. గత సీజన్లలో నిధులందినవారు ప్రస్తుత ఎలాంటి వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ జిల్లా అధికారి పాక సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. నూతన పట్టాదారులు, గతంలో నిధులు రానివారు, వివరాలివ్వనివారు ఆయా క్లస్టర్ల ఏఈవో వద్ద దరఖాస్తు ఫారం తీసుకుని భూమి పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలు ప్రతులతో వెంటనే దరఖాస్తు చేయాలని సూచించారు. కాగా గత సీజన్‌లో ఎలాంటి భూ పరిమితి విధించకుండా



రైతులందరికీ ఎకరాకు రూ.5 వేల చొప్పున అందించగా ఈ సారి కూడా భూ పరిమితి ఉండదని, అందరికి నిధులందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలిరోజు ఎకరం వరకు భూమి కలిగినవారికి నిధులను విడుదల చేసి ఆరోహణ క్రమంలో ప్రతిరోజూ ఒక్కో ఎకరం చొప్పున పెంచుతూ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేస్తారు.

# సరిపోని కార్మికులు.. స్వచ్ఛతకు ఇక్కట్లు

మెట్‌పల్లి : గ్రామాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికులదే కీలకపాత్ర. మెజార్టీ పంచాయతీల్లో సరిపడా సిబ్బంది లేక స్వచ్ఛత లోపిస్తోంది. ప్రభుత్వ నిబంధనలతో చాలా పంచాయతీల్లో ఇద్దరు, ముగ్గురు సిబ్బందికే పరిమితం కావాల్సి వస్తోంది. దీంతో గ్రామాల్లో ఉన్న కార్మికులతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని పంచాయతీల్లో కొన్ని నెలలకోసారి ప్రయివేట్ కార్మికులతో మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తున్నారు.

గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ప్రజారోగ్యం బాగుంటుంది. ఎప్పటికపుడు చెత్తను తొలగించడంతో పాటు మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచాలి. పరిశుభ్రతలో కీలకపాత్ర వహించే పారిశుద్ధ్య కార్మికుల కొరత గ్రామాలను వేధిస్తోంది. జిల్లాలో 380 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో చిన్న పంచాయతీలు చాలా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల వల్ల చిన్న పంచాయతీల్లో ఇద్దరికి మించి కార్మికులను నియమించుకునే పరిస్థితి లేదు. కొన్ని పంచాయతీల్లో అవసరాల రీత్యా స్థానిక పంచాయతీ తీర్మానంతో ఒకరిద్దని నియమిం చుకుంటున్నారు. కానీ ఆదాయ పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న గ్రామాల్లో వేతనాలు చెల్లించలేక ఉన్నవారితో నెట్టుకొస్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సేవలు లోపిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



జనాభా ఎక్కువ.. సిబ్బంది తక్కువ

ప్రభుత్వం 2011 ప్రకారం 500లోపు జనాభా ఉన్న పంచాయతీల్లో ఇద్దరిని, ఎక్కువ ఉంటే 500 జనాభాకు ఒకరిని చొప్పున మల్టీపర్పస్ పంచాయతీ కార్మికులను నియమించుకునే వెసులుబాటు కల్పించింది. వీరు పారిశుద్ధ్యంతో పాటు, చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేరు చేయడం, ట్యాంకర్, ట్రాక్టర్ నిర్వహణ, నీటి వనరుల నిర్వహణ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. దీంతో సిబ్బంది కొరతతో గ్రామాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో జనాభా పెరగడం, ప్రభుత్వం 2011 జనాభా ప్రకారం పంచాయతీ కార్మికులను నియమించాలనే నిబంధన పెట్టడంతో సిబ్బంది సరిపోవడం లేదు. మెట్‌పల్లి మండలంలో 23 పంచాయతీలుండగా, 14 పంచాయతీల్లో ఇద్దరు, ముగ్గురు కార్మికులే ఉన్నారు. జిల్లాలో పలు పంచాయతీల పరిస్థితి ఇదే విధంగా ఉంది. దీనివల్ల స్థానిక ప్రజాప్రతినిధులు కూడా అవస్థలు పడుతున్నారు.

ప్రత్యేక కార్యక్రమాల సమయంలోనే హడావుడి

పల్లె ప్రగతి, ఇతర ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలపుడే గ్రామాల్లో హడావుడిగా పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రయివేట్ కార్మికులను తీసుకొచ్చి మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తున్నారు. మిగతా సమయాల్లో మామూలుగానే ఉంటోంది. మురుగు కాల్వలు ఎప్పటికపుడు శుభ్రం చేయకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణ కూడా అమలు కావడం లేదు. కంపోస్టు షెడ్డుల్లో చాలా వరకు అరలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరడం లేదు. ప్రభుత్వం స్పందించి జనాభాకు సరిపడా సిబ్బందిని నియమించేలా చూడాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

నిబంధనలకు అనుగుణంగానే- శ్రీనివాస్, డీఎల్‌పీవో

గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది ఉన్నారు. ఉన్న సిబ్బందితోనే ప్రజలకు పారిశుద్ధ్య సేవలు అందేలా చూస్తున్నాము. కొన్ని చోట్ల ఆదాయ పరిస్థితిని బట్టి పంచాయతీ తీర్మానం మేరకు అదనపు సిబ్బందిని నియమించుకుంటున్నారు. ప్రస్తుత జనాభా ప్రకారం సిబ్బందిని నియమించాలని ప్రజాప్రతినిధులు విన్నవిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయాము.

# అడ్డగోలుగా కోతలు.. అవస్థల్లో ప్రజలు

కరీంనగర్ : కరీంనగరం.. ఆపై జిల్లా కేంద్రం.. ఇక్కడ ఎలాంటి విద్యుత్తు కోతలు ఉండవని భావిస్తుంటారు. కానీ నగర ప్రజలు గత మూడేళ్లుగా అంతరాయాలతో ఇబ్బందిపడుతున్నారు. నిత్యం ఏదో ఒక కారణంతో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తూ నగరవాసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఒకటి, రెండు రోజులంటే సర్దుకుపోయేవారు. కానీ ఏళ్ల తరబడి ఇదే తంతు కావడంతో అసహనానికి గురవుతున్నారు. ఓ రోజు చెట్లకొమ్మలు కొట్టే కార్యక్రమం.. మరో రోజు స్మార్ట్ సిటీ పనులు, నియంత్రికల ఏర్పాటు, లైన్ తొలగింపు, ఉప కేంద్రాల నెలవారి నిర్వహణ పేరిట నిత్యం గంటల తరబడి నిలిపివేస్తున్నారు.

ఉపాధికి దెబ్బ..నగరంలో ఏదో ఒక చోట రోజు కరెంటు సరఫరా నిలిపివేయడంతో విద్యుత్తు ఆధారిత పనులు కుంటుపడుతున్నాయి. జిరాక్స్, డీటీపీ కేంద్రాలు, బేకరీలలో భారీ ఓవెన్స్, దూగోడ, కలర్ మిక్సింగ్, నీటి శుద్ధికేంద్రాలు, టైలర్లు, వీడియో, ఆడియో మిక్సింగ్ కేంద్రాలు, డిజిటల్ ల్యాబ్‌లు, ప్రింటింగ్ ప్రెస్‌లు, ఏటీఎంలు ఇలా విద్యుత్తుతో పనిచేసే పలు పనులు నిలిచిపోతున్నాయి. సాంకేతిక ఉద్యోగుల పని కుంటుపడుతోంది. ప్రైవేట్ నెట్‌వర్కులు పనిచేయక పనులు ముందుకు సాగక ఇబ్బంది పడుతున్నారు. ఉపాధికి ఎసరు వస్తోంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు ఏకధాటిగా తీసివేయడంతో వినియోగదారులు తాకిడి ఉండే సమయంలో విద్యుత్తులేక వ్యాపారాలను మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

గృహ వినియోగదారులకూ ఇబ్బందే..

ఉదయం నిలిపివేసి మధ్యాహ్నం పునరుద్ధరించడంతో గృహ వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు మధ్యాహ్నం వరకే నిండుకోవడంతో కాలకృత్యాలకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. చిన్నపిల్లలు, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఇబ్బందిపడేవారు కరెంటు సరఫరా లేకపోవడంతో అస్వస్థతకు గురవుతున్నారు. తెలిసిన వారి ఇళ్లలోకి వెళ్లి ఆక్సిజన్, నెబలైజర్లను వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది.

గత వారం రోజుల్లో సరఫరా నిలిపివేసిన ప్రాంతాలు..

ఈనెల 18న భగత్‌నగర్ ఉపకేంద్రంలో నిర్వహణ పేరిట దాని పరిధి

19న 11కేవీ లైన్ పనులకు టవర్ సర్కిల్ ఫీడర్ పరిధి

21న 11కేవీ కొత్త నియంత్రిక ఏర్పాటుకు గీతాభవన్ ఫీడర్ పరిధి

22న 11కేవీ హెచ్‌టీ, ఎల్‌టీ లైన్ తొలగించడానికి ఎల్లమ్మ ఫీడర్ పరిధి

24న ఎల్లమ్మ ఫీడర్, కమాన్ ఫీడర్లకు హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్తు తొలగించాలంటూ.. ఇదే రోజు తీగల బ్రిడ్జి పనుల నిమిత్తం భగత్‌నగర్, ఉజ్వలపార్కు, పద్మనగర్, సప్తగిరి కాలనీ, వాటర్ గ్రిడ్, అలుగునూర్‌లలోని 33/11కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలకు..కేబుల్ బ్రిడ్జి పనుల కారణంగా తొలగించాం

కేబుల్ బ్రిడ్జి పనులలో భాగంగా రహదారికి అడ్డుగా ఉన్న టవర్లను తొలగించడానికి సరఫరా నిలిపివేయాల్సి వచ్చింది. సాధ్యమైనంత వరకు పునరుద్ధరించాం. వినియోగదారులకు ముందస్తుగా వ్యక్తిగత చరవాణులకు సమాచారం చేరవేశాం.రాజం, డీఈ కరీంనగర్‌డివిజన్ పని లేకుండా పోతోంది..పగటి పూట విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో పని చేసుకోకలేకపోతున్నాం. శుభలేఖలు, గృహప్రవేశాల ఆహ్వాన పత్రికలు ముద్రణకు ఇచ్చిన వారికి సకాలంలో వాటిని ముద్రించి ఇవ్వలేకపోతున్నాం.వరికిల్ల కనకయ్య, ప్రింటింగ్ ప్రెస్ యజమాని

# బోధన.. అభ్యసన..!

ఆలేరు : విద్యార్థులకు ప్రాథమిక దశలోనే చక్కటి పునాది పడితే ఉజ్వల భవితకు మార్గం సుగమం అవుతుంది. ఇందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.వేల కోట్లు ఖర్చు పెడుతూ ప్రతి ఏడాది రకరకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి గతేడాది ఆగస్టు నుంచి 'తొలిమెట్టు' అమలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ఏడాది రెండో విడత తొలిమెట్టులో భాగంగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం సంబంధిత 'బోధనా ప్రణాళికలు' అందించారు. ఇవి ప్రణాళికాబద్ధంగా తేలికగా బోధించేందుకు ఉపయోగపడనున్నాయి. కనీస సామర్థ్యాలు పెంచుకునేందుకు వీలుగా తొలిసారి విద్యార్థులకు 'అభ్యసన' (వర్క్‌బుక్స్) పుస్తకాలు విడతల వారీగా పంపిణీ చేయనుండటం గమనార్హం.

ముందస్తుగా సిద్ధం కావాలని..

ప్రాథమిక స్థాయిలో తెలుగు, ఆంగ్లం, గణిత సామర్థ్యాల సాధనకు తొలిమెట్టును కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే మొదటి ఏడాదిలో ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ఎస్‌సీఈఆర్టీ అధికారులు ఉపాధ్యాయులకు బోధన ప్రణాళిక, విద్యార్థులకు అభ్యసన పుస్తకాలను అందించేందుకు సన్నద్ధమయ్యారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు సంబంధించిన బోధన ప్రణాళికలపేరుతో పుస్తకాలు రూపొందించారు.



ఉపాధ్యాయుల బోధనకు ముందుగానే పంపిణీ అయ్యేలా అవసరమైన సామగ్రి సమకూర్చుకునేందుకు అవకాశాలు పొందుపర్చారు.

ఆగస్టు 2 నుంచి మండలస్థాయిలో శిక్షణలు

తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుకు మండల పరిధిలో సంబంధించి ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున ఎంపిక చేసి జిల్లా కేంద్రంలో తర్ఫీదునిచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న సదరు ఉపాధ్యాయుల ద్వారా ఆగస్టు 2, 3 తేదీల్లో తెలుగు, ఉర్దూ, 4, 5 తేదీల్లో గణితం, 7, 8 తేదీల్లో ఆంగ్లం సబ్జెక్టులపైన జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో బోధన ప్రణాళిక, అభ్యసన పుస్తకాలు తదితర అంశాలపై సబ్జెక్టుల వారీగా తర్ఫీదు పొందనున్నారు. తద్వారా విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనం వివరించనున్నారు. ఇందుకు జిల్లా విద్యాశాఖ సర్వసన్నద్ధమవుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రయోజనం

జంగిటి కృష్ణ, మండల విద్యాధికారి, రాజపేట

విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న బోధన ప్రణాళిక అభ్యసన పుస్తకాలతో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఉపాధ్యాయులు తనకు కేటాయించిన పీరియడ్‌లో 45 నిమిషాలు బోధించి మిగిలిన సమయాన్ని అభ్యసన పుస్తకంలోని వర్క్ షీట్‌లో రాసుకోవాలి. ఐదు రోజులు బోధించిన తర్వాత ఆరో రోజు అందుకు సంబంధించిన మూల్యాంకనం పేజీతో పరీక్ష నిర్వహించాలి. ఇలాంటి విధానం అమలుతో విద్యార్థుల్లో ప్రమాణాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

# పెచ్చులూడుతూ.. నీళ్లు కారుతూ

కామారెడ్డి : జిల్లా ఆసుపత్రి పైన పటారం లోన లొటారం అన్న చందంగా మారింది. ఏళ్ల నాటి జిల్లా ఆసుపత్రిలో వివిధ గదులు శిథిల దశకు చేరాయి. వర్షాలకు పై కప్పు నుంచి నీళ్లుకారడం, గోడలకు తేమ రావడం, పీవోపీ నిర్మాణాలు ఊడి కింద పడిపోవడంతో రోగులు బిక్కుబిక్కుమంటూ చికిత్స పొందుతున్నారు. పిల్లల విభాగం పక్క గదిలో పీవోపీ కింద పడగా శుక్రవారం ఐసీయూ విభాగంలో నీళ్లు కారడంతో భయాందోళనకు గురయ్యారు. పీవోపీ పలకలను తొలగించారు. పాత భవనంపైనే షెడ్ల నిర్మాణం చేపట్టడంతో సమస్య నెలకొంది. ఎక్కడెక్కడంటే.. జిల్లా ఆసుపత్రిలో ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో గోడలకు తేమ వస్తోంది. విద్యుత్తు స్విచ్‌బోర్డులు ప్రమాదకరంగా మారాయి. ఇదే వార్డులో శిశువులకు చికిత్స అందిస్తుండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వారం కిందట ఆపరేషన్ థియేటర్‌లో స్విచ్‌బోర్డులోకి నీరు రావడంతో విద్యుదాఘాతం అయింది. అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఆసుపత్రి మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన షెడ్‌లో నిర్మాణాలు ఊడి కింద పడుతున్నాయి. బాలింతలు చికిత్స పొందే గదిలో ఇబ్బందులు తప్పడం లేదు. ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ నుంచి నీరు కారుతోంది. గోడలకు తేమ వస్తోంది. దాదాపు అన్ని విభాగాల్లో ఇదే సమస్య నెలకొంది.

విభాగాలన్నీ ఒకేచోట.. 100 పడకల ప్రాంతీయాసుపత్రి స్థాయి నుంచి జిల్లా ఆసుపత్రిగా మారింది. ఆ తర్వాత మాతాశిశుసంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) కోసం రూ.17 కోట్లతో కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీకళాశాల వెనుకభాగంలో దేవునిపల్లి పీహెచ్‌సీ సమీపంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇటీవల కామారెడ్డికి వైద్యకళాశాల ప్రకటించడంతో బోధనాసుపత్రిగా ప్రస్తుత జిల్లా ఆసుపత్రిని మార్చారు. ఆచార్యులు, సహాయ ఆచార్యులు వచ్చి విధుల్లో చేరారు. ఇక్కడ 27 విభాగాలు ఏర్పాటు అవసరం. ఎంసీహెచ్ భవనంలో వైద్యకళాశాల నిర్వహణకు కసరత్తు ప్రారంభించారు. అపరిష్కృత పనులపై దృష్టి పెట్టారు. ప్రస్తుత జిల్లా ఆసుపత్రిలో పై అంతస్తులో షెడ్ల నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ నుంచి కిందికి నీరు కారడంతో ఆయా విభాగాల్లో సమస్య నెలకొంది. గోడలకు పగుళు బారుతున్నాయి. ఇక్కడ 15-20 విభాగాలన్నీ ఒకే చోట ఉండటంతో ఇరుకిరుకుగా మారింది.

అసౌకర్యం కలగకుండా సేవలుడా.విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు

జిల్లా ఆసుపత్రిలో స్లాబ్ తడిసి పీవోపీ నిర్మాణాలు కింద పడుతున్నాయి. దీంతో రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఎక్కడైతే నీరు కారుతుందో అక్కడ పడకలను తొలగించాం. అన్ని విభాగాలు ఒకే చోట ఉండటంతో సమస్య నెలకొంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గదుల్లోనే సేవలు అందిస్తున్నాం.

# బిరబిరా కృష్ణమ్మ.. తరలివస్తోంది..!



నల్గొండ: ఆలమట్టి, నారాయణపూర్, జూరాల నిండుకుండలను తలపిస్తుండటంతో.. కృష్ణమ్మ దిగువన ఉన్న శ్రీశైలం వైపు పరుగులు పెడుతోంది. రెండు రాష్ట్రాల వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్‌కు వచ్చే వారం రోజుల్లో భారీ ప్రవాహాలు మొదలవుతాయని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని ఎడమకాల్వ కింద ఉన్న 3.8 లక్షల ఎకరాల ఆయకట్టులో సాగు పనులు ముమ్మరం కానున్నాయి. సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా.. గత వారం వరకు వానలు లేకపోవడంతో సాగర్ జలాశయం కనిష్ఠ నీటిమట్టానికి పడిపోయింది. ఇప్పుడిప్పుడే స్థానికంగా కురుస్తున్న వర్షాలు, కృష్ణా బేసిన్‌లోనూ నీటి ప్రవాహాలు మొదలు కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 6.83 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగుతో రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా మొదటి స్థానంలో ఉండగా..సూర్యాపేటలో ఇప్పటి వరకు కేవలం 24.59 శాతం విస్తీర్ణంలో మాత్రమే అన్నదాతలు పంటలను సాగు చేశారు.ఎడమ కాల్వ ఆయకట్టుకు నీటి విడుదల లేకపోవడంతో సుమారు 3.5 లక్షల ఎకరాల్లో అన్నదాతలు వరినాట్లు వేయలేదు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను బట్టి సాగర్ ప్రాజెక్టు నుంచి పక్షం రోజుల్లో కాలువలకు నీటి విడుదల చేసే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతేడాది జులై 29న (ఇదే రోజున) ఎడమ కాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సీజన్‌లో పక్షం రోజులు ఆలస్యం కానుందని అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ఆయకట్టు కింద నూరు శాతం విస్తీర్ణంలో పంటలు సాగుకానున్నాయి.

యాదాద్రి జిల్లాలో ఇప్పటి వరకు 58.86 శాతం విస్తీర్ణంలో రైతులు పంటలను సాగు చేశారు. తాజా వర్షాలతో అది మరింత పెరగనుంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టుకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా..సాగర్‌కు 6,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నల్గొండలో 57.8 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా...ఈ నెల 28 (శుక్రవారం) వరకు 80.1 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. సూర్యాపేటలో 80.9 మి.మీ.కు గానూ 219.4 మి.మీ., యాదాద్రిలో 63.2 మి.మీ.కు గానూ 280 మి.మీ.ల వర్షపాతం నమోదైందని గణాంకాలు వెల్లడించాయి.

పంట నష్టంపై క్షేత్రస్థాయి విచారణ

యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని సుమారు 20 మండలాల్లో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను పూర్తి స్థాయిలో వర్షాలు తగ్గితేనే అధికారులు క్షేత్రస్థాయిలో సేకరించనున్నట్లు తెలిసింది. భువనగిరి, నారాయణపురం, చౌటుప్పల్, వలిగొండ, తుంగతుర్తి, నకిరేకల్, కట్టంగూరు మండలాల్లోని చాలా ప్రాంతాల్లో పత్తి పంటలో నీళ్లు నిలవడంతో నష్టం వాటిల్లిందని, నూతన్‌కల్, మద్దిరాల, ఆత్మకూరు, చివ్వెంల, సూర్యాపేట మండలాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం రాష్ట్ర వ్యాప్తంగా పంట నష్టం వివరాలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించడంతో రెండు మూడు రోజుల్లో క్షేత్రస్థాయి పర్యటన అనంతరం సమగ్రంగా నివేదిక ఇస్తామని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

# అడ్డదారుల్లో ఇసుక అక్రమ రవాణా



నల్గొండ: దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట, దేవరకొండ మండల పరిధిలోని మానావత్‌తండా వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. దీంతో ప్రభుత్వాదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది. దృష్టి సారించాల్సిన పోలీస్ యంత్రాంగం సిబ్బంది కొరతతో సతమతమవుతోంది.

కొత్త ఉపాయాలు

అక్రమ పద్ధతిలో ఇసుక రవాణాకు అనేక తరుణోపాయాలను వెతుక్కొని సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. దేవరకొండ మండలంలోని గొట్టిముక్కల, తాటికోల్, పోలేపల్లి సరిహద్దులో మానావత్‌తండా, ముదిగొండ వాగు నుంచి ఇసుక రవాణాకు కొత్తపోకడలు కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ ట్రాలీ పైపూత కంకర పొడి, కింద ఇసుక ఉంచి రవాణా సాగిస్తున్నారు. శుక్రవారం ఇదే తరహాలో మానావత్‌తండా నుంచి కొండమల్లేపల్లికి వెళ్తుండగా దేవరకొండ పోలీసులు రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇదేతండా నుంచి కొత్తపల్లి మీదుగా కొండమల్లేపల్లికి ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆదాయానికి భారీగా గండి

2017లో ప్రభుత్వం ఆన్‌లైన్ సాండ్ టాక్స్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గృహ నిర్మాణాలు చేపట్టేవారు ఆన్‌లైన్ విధానం ద్వారా ముందస్తుగా ఇసుకను బుక్ చేసుకోవాలి. ఈ విధానం ద్వారా వచ్చే ఆదాయంలో 70శాతం మైనింగ్‌కు, 30శాతం ఇసుక రిచ్ ఉన్న గ్రామపంచాయతీకి వెళ్తాయి. దీంతో గ్రామాభివృద్ధికి నిధులు కొంత తోడ్పాటునందిస్తున్నాయి. ఆదాయం సమకూర్చడంలో 2021 వరకు దేవరకొండ మండలంలోని ఇసుకరిచ్ జిల్లాలో అగ్రగామిగా నిలిచింది.

సిబ్బంది కొరత: సతీష్, ఎస్సైఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు సిబ్బంది కొరత సమస్యగా మారింది. రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

# అమ్మవారి సేవకు పిలుపు లేనట్లేనా!



నల్గొండ: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుక ఎల్లమ్మ ఆలయ పాలకమండలి పదవి కాలం ముగిసి నాలుగేళ్లు దాటినా తాత్కాలిక కమిటీతో కాలం గడుపుతూ వస్తున్నారు. ఆలయ పాలకమండలి నియామకానికి ఇప్పటికే రెండు సార్లు ప్రకటనలు జారీ చేసినా స్థానిక ప్రజాప్రతినిధి ఆ సభ్యుల వివరాలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకు అందించకపోవడంతో నియామకం ముందుకు సాగడం లేదు. గత సంవత్సరం డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేయగా దానిని రద్దు చేయించారు. తిరిగి ఈ సంవత్సరం ఏప్రిల్‌లో మరోసారి ప్రకటన జారీ చేశారు. దర్వేశిపురం, పర్వతగిరి గ్రామాలకు చెందిన వారిని పాలకమండలి సభ్యులుగా ఎంపిక చేసి స్థానిక ప్రజాప్రతినిధికి జాబితా అందజేశారు. ఆయన దేవాదాయ శాఖకు ఆ సభ్యుల వివరాలు అందజేయకపోవడంతో నోటిఫికేషన్ రద్దు అయింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు కొత్త కమిటీ లేకుండా పాత కమిటీని కొనసాగించాల్సిందిగా స్థానిక నేతలు ప్రజాప్రతినిధిపై ఒత్తిడి తేవడంతోనే కమిటీ ఏర్పాటు ముందుకు సాగడం లేదని అధికార పార్టీలో చర్చ జరుగుతోంది. నోటిఫికేషన్ విడుదల చేసినా దరఖాస్తు చేసుకోవడానికి 20 రోజుల గడువు ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల పూర్తి సమాచారం తెలుసుకునేందుకు పోలీసులు విచారణ సాగిస్తారు. ధర్మకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు ఉంటే అనర్హులవుతారు. అన్ని సిద్ధమయ్యేసరికి శాసనసభ ఎన్నికల ప్రకటన జారీ అయితే అమ్మవారికి సేవ చేసే అవకాశం ఉండకపోవచ్చు.

# జీజీహెచ్ భవనంలో లీకేజీల భయం

నిజామాబాద్ : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో లీకేజీల భయం వెంటాడుతోంది. ఇప్పటికే పలు గోడలకు పగుళ్లు రాగా.. మరికొన్ని చోట్ల నాచుపట్టి ప్రమాదకరంగా మారాయి. అన్ని అంతస్తుల్లోనూ డ్రైనేజీ పైపులైన్లు లీకేజీ కావడం, ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. మరమ్మతులకు రూ.1.50 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.

నిధులు కేటాయించలేదు..

2013-14లో వైద్య కళాశాలతో పాటు దాని అనుబంధ ఆసుపత్రి జీజీహెచ్ అందుబాటులోకి వచ్చింది. భవనాన్ని నిర్మించిన సంస్థ ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చూసుకుంది. అనంతరం నిర్వహణ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. పలుచోట్ల పైపులైన్లు పగిలి లీకేజీలు మొదలయ్యాయి. ఇలా ప్రతీ అంతస్తులోనూ మూత్రశాలలు, కారిడార్లలో డ్రైనేజీలు లీకవుతున్నాయి. పలు సందర్భాల్లో రోగుల నిర్లక్ష్యం కారణంగానూ పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. తాత్కాలికంగా బాగుచేసినా శాశ్వత చర్యలు చేపట్టకపోవటంతో సమస్య మరింత పెరిగింది.

ఖాళీ ప్రదేశాల్లోకి చేరి..

డ్రైనేజీ నీరు సరిగా వెళ్లే మార్గంలేక ప్రత్యామ్నాయం కోసం గోడలను



తవ్వాల్సి వచ్చింది. ఈ క్రమంలో వృథానీరు నేరుగా ఆసుపత్రి భవనం బయటి గోడలపై పారి గోడలు పూర్తిగా నాచుపట్టిపోతున్నాయి. కింద పడిన మురుగంతా ఆసుపత్రి ఆవరణ నుంచి ఓపెన్ డ్రైనేజీలో కలుస్తోంది. మూత్రశాలలు, రోగులు తిరిగే పరిసరాలను శుభ్రం చేసిన నీరు ఇలా ఖాళీ ప్రదేశాల్లో పారడం ప్రమాదకరమే.

పరిసరాల్లో దుర్వాసన..

డ్రైనేజీ నీరు పారుతున్న ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. దీంతో వైద్యులు, విద్యార్థులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. శానిటేషన్ సిబ్బంది రోజు రెండు దఫాలుగా పరిసరాలు శుభ్రం చేస్తున్నా ఎలాంటి ప్రయోజనం ఉండట్లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావటంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశముంది. కనీసం తాత్కాలికంగా అయినా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. పైపులైన్ల మరమ్మతుకు టీఎస్‌ఎంఐడీసీ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, సమస్య పరిష్కారానికి సూపరింటెండెంట్ డా.ప్రతిమారాజ్ ఉన్నతాధికారులతో పలుమార్లు మాట్లాడారని జీజీహెచ్ ఏడీ సంతోష్‌కు తెలిపారు.

# పరిరక్షించకుంటే.. పరులపాలే

నిజామాబాద్ : ఆలయ భూముల పరిరక్షణలో యంత్రాంగం ఉదాసీనత.. చట్టాల్లో లొసుగులు అక్రమార్కులకు వరంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే వందల ఎకరాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లినా.. సంబంధిత శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఏళ్ల కిందట ఇళ్ల నిర్మాణం, సాగులో ఉన్నవారికి పట్టా పాసు పుస్తకాలు జారీ అయ్యాయి. ఇలాంటి విషయాల్లో ఎలా ముందుకెళ్లాలో తెలియక సతమతవుతుంటే.. ఇటీవల వెలుగులోకి వచ్చిన పరిణామాలు చూస్తే.. అసలు దేవుడి భూములకు రక్షణ సాధ్యమేనా? అనే సందేహం కలుగుతోంది. సిబ్బంది కొరతకు తోడు.. రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయ లోపం కూడా సమస్యకు దారితీస్తోంది. ఇటీవల గుర్తించిన కబ్జాల విషయంలో కేసులు వేసే పనిలో నిమగ్నమైన అధికారులు.. గతంలో జరిగిన విషయాలపై మిన్నకుంటున్నారు.

కట్టడిలో వెనకడుగు..దేవాదాయశాఖలో భూముల రికార్డుల నిర్వహణ ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. ఏ భూమి ఎక్కడుందో శాఖ ఉద్యోగులకే హద్దులు తెలియని పరిస్థితి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇతరులు సాగు చేసుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు, కొన్నిచోట్ల వాణిజ్య అవసరాలకు షెట్టర్ల నిర్మాణం జరిగింది. ఆలస్యంగా తేరుకున్న అధికారులు వాటి విషయంలో కేసులు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే సాగులో ఉన్నవి కాకుండా.. ప్రస్తుతానికి వాణిజ్య పరంగా నిర్మించుకున్న వాటి విషయంలోనే కేసులు వేసేందుకు చూస్తున్నారు.

మొక్కుబడిగా మూడు చోట్లే కేసులు

నిజామాబాద్ నగరం కంఠేశ్వర్ చౌరస్తాకు సమీపంలో నీలకంఠేశ్వరాలయానికి చెందిన వెయ్యి చదరపు గజాల భూమి కబ్జాకు గురైనట్లు ఇటీవల నిర్ధరించారు. నిర్మాణాలు చేపట్టిన వారిపై కేసులు వేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రం జెండా బాలాజీ ఆలయానికి చెందిన 1200 చదరపు గజాల భూమి ఇతరులు ఆక్రమించారు. వీరిపైనా కేసు వేసేందుకు సిద్ధమయ్యారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 1.15 ఎకరాల భూమి ఇటీవల అన్యాక్రాంతమైనట్లు గుర్తించారు. పలుకుబడి గల వ్యక్తి ఇందులో వాణిజ్య అవసరాలకు ఉపయోగపడేలా కాంప్లెక్స్ కట్టినట్లు గుర్తించారు. నిర్మాణ సమయంలో ఉదాసీనంగా వ్యవహరించిన అధికారులు ఆలస్యంగా మేల్కొని ఇప్పుడు మొక్కుబడిగా కేసు వేసేందుకు చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పర్యవేక్షణ అంతంత మాత్రమే..

ఉమ్మడి జిల్లాలో 384 ఆలయాలకు 4153.25 ఎకరాల మాన్యం ఉంది. నిజామాబాద్ జిల్లాలో 247 ఆలయాల పరిధిలోనే 2287.18 ఎకరాలు, కామారెడ్డి జిల్లాలో 137 ఆలయాల పరిధిలో 1866.06 ఎకరాలు ఉన్నట్లు భూ రికార్డులు చెబుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో 23 ఆలయాలకు సంబంధించి 245.22 ఎకరాలు, కామారెడ్డి జిల్లాలోని 23 ఆలయాలకు సంబంధించి 863.27 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 1109.09 ఎకరాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లినట్లు సంబంధితశాఖనే నిర్ధరించింది. ఇందులో సదాశివనగర్‌లోని విశ్వేశ్వర స్వామి ఆలయానికి సంబంధించినదే 528.24 ఎకరాలు ఉండటం గమనార్హం.

కొత్తగా కబ్జాలకు తావివ్వడం లేదు

ఏళ్ల కిందట అన్యాక్రాంతమైన భూములు, ఇళ్ల నిర్మాణాల విషయంలో దేవాదాయ ట్రైబ్యునల్ ద్వారా నోటీసులిచ్చే ఆలోచన చేస్తున్నాం. భూములు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితుల్లో ఆక్రమణకు గురయ్యాయి. ఈ విషయంలో చట్టానికి లోబడి ముందుకెళ్తాం. ఇటీవల రికార్డుల ఆధారంగా భూమిని గుర్తించి.. ఇకపై కబ్జా కాకుండా చర్యలు చేపడుతున్నాం. తాజాగా వెలుగులోకి వస్తున్న విషయాలపైనా కేసులు వేసే ప్రక్రియ కొనసాగుతోంది. నాలుగు వేల ఎకరాలకు పైగా భూముల పర్యవేక్షణకు ఈవో స్థాయి ఉద్యోగులు అయిదుగురే ఉన్నారు. ఇది ఇబ్బందిగా మారింది. దీనికి తోడు కోర్టు కేసుల భారం కూడా పడుతోంది.సుప్రియ, సహాయ కమిషనర్ దేవాదాయశాఖ

# అన్నదాతకు కన్నీరు

వరంగల్ : వర్షాలు జిల్లాలో అన్నదాతలకు కన్నీళ్లే మిగిల్చాయి. మొక్కదశలోనే పంటలు ముంపునకు గురయ్యాయి. వానాకాలం సీజన్ మొదట్లో వేసిన విత్తనాలు వర్షాల్లేక మొలకెత్తక రైతు నష్టపోయారు. తరవాత అడపాదడపా పడిన జల్లులకు పంటలు సాగుచేసుకుంటే ఇప్పుడు వరదలు నిండా ముంచాయి. పలు ప్రాంతాల్లో పంటచేలు కొట్టుకుపోయి ఇసుక మేటలు వేశాయి. మిగిలిన పంటలు వారం రోజులుగా నీళ్లు నిలిచి ఎర్రబారి చనిపోతున్నాయి. రైతులకు వాటిల్లిన నష్టం, వ్యవసాయ శాస్త్రవేత్తలు చేస్తున్న సూచనలపై ప్రత్యేక కథనం..

రూ.కోట్లల్లో నష్టం..

జిల్లాలో పత్తి అధిక విస్తీర్ణంలో సాగయింది. ఎకరంలో పత్తి సాగుకు విత్తనాలు, దుక్కి, కూలీలు, ఎరువుల ఖర్చు కలిపి సుమారు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాలకు 80,746 ఎకరాల్లో పంట ముంపునకు గురికావడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.121.11 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. వరి సాగు ఎకరాకు రూ.14 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. ఈ లెక్కన 17,500 ఎకరాల్లో పంట ముంపునకు గురికావడం, కొట్టుకుపోవడం జరిగింది. దీంతో సుమారు రూ.25.37 కోట్లు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా. మొక్కజొన్న సాగు చేసిన రైతులు రూ.3.13 కోట్లు, కంది పంట 174 ఎకరాల్లో ముంపునకు గురికావడంతో రూ.9.57 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు.

ఆరు ఎకరాల్లో వరిసాగు..కుల్ల సుధాకర్, నెక్కొండ

ఆరు ఎకరాల్లో వరినాట్లేయించా. సుమారు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టాను. రెండేళ్ల క్రితం వచ్చిన వరదల్లో కూడా ఆరు ఎకరాల వరి పంట నీట మునిగింది. అప్పుడు ఎలాంటి నష్టపరిహారం రాలేదు. ఇప్పుడు వరదలకు పంట పూర్తిగా నీటిపాలైంది. అప్పులు తెచ్చి పంటలు సాగుచేస్తే ఏటా ఇలా నష్టాలు మిగులుతున్నాయి. ఏటా వస్తున్న విపత్తులకు వ్యవసాయ శాఖ నుంచి ఎలాంటి పరిహారం రావడం లేదు. పాలకులు స్పందిస్తారని ఆశిస్తున్నాం.

బంగారం తాకట్టుపెట్టా..మాకు వర్ధన్నపేట మండలం కడారిగూడెం కుంట కింద మూడెకరాల పొలం ఉంది. భార్య నగలు ఇల్లంద



బ్యాంకులో పెట్టి రూ.60 వేలు రుణం తీసుకొని పెట్టుబడి పెట్టాం. ఇటీవలే మూడెకరాల్లో వరి నాట్లేశాం. 24 గంటలు గడవకముందే భారీ వర్షాలకు కుంట కట్ట తెగి పంటంతా కొట్టుకుపోయింది. పొలం మొత్తం ఇసుక మేటలు వేసింది. పెట్టుబడి నష్టపోవడమే కాకుండా ఇసుక మేటలు తొలగించుకొని, మళ్లీ సాగుకు సిద్ధం చేసుకోవాలంటే మరో రూ.50 వేలు ఖర్చు చేయాల్సిందే.

మహిళా సంఘంలో అప్పు తీసుకున్నాంపొన్నం వనమ్మ, రాజపల్లి (నర్సంపేట)

మాకు రాజపల్లి శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 30 గుంటలను మిరప చేనుకు కేటాయించాం. మిగిలిన 1.10 ఎకరాల్లో పత్తి పంట వేశాం. ఈ వర్షాలకు పొలంలో నీళ్లు నిలిచి పత్తిమొక్కలు ఎర్రబారాయి. ఎదుగుదల లేక పంట గిడసబారింది. పెట్టుబడి కోసమని మహిళా పొదుపు సంఘంలో రూ.లక్ష అప్పు తీసుకొన్నాం. భార్యాభర్తలం ఇద్దరం పని చేసినా వానలతో అంతర్ కృషి లేక కలుపు పెరిగింది. దుక్కి, విత్తనాలు, కూలీలు, ఎరువుల బస్తాలు కలిపి ఇప్పటి వరకు రూ.35 వేల పెట్టుబడి అయింది. మిరప నారు కూడా చచ్చిపోతోంది.

సస్యరక్షణ అవసరం..డా.రావుల ఉమారెడ్డి, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్, సీనియర్ శాస్త్రవేత్త

పత్తి పంట : 45 రోజుల దశలో పైర ఉంది. నీటి నిలువను తట్టుకోదు. పొలంలో వర్షం నీరు లేకుండా తొలగించుకోవాలి. వర్షం తగ్గిన వెంటనే కలుపు తీయాలి. ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లాలి. లీటరు నీటిలో 20 గ్రాముల చొప్పున పొటాషియం నైట్రేట్ మందు కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఎక్కువ నీరు కారణంగా మొక్కలు చనిపోతుంటే లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మొదళ్ల దగ్గర పోయాలి.

వరి : ఇప్పటికీ వరి నారు చల్లకుంటే మరో రెండ్రోజులు ఆగాలి. ఇప్పుడు విత్తనం వేస్తే కుళ్లి పోయి, మొలకశాతం తగ్గుతుంది. వెదజల్లే పద్ధతిలో విత్తుకున్న పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలి. వర్షాలు తగ్గాక నారుమళ్లు ఎర్రబడతాయి. దీని నివారణకు ఎకరం నారుమడికి రెండు కిలోల యూరియా వేయాలి. అలాగే 19:19:19 పోషకాన్ని 10 గ్రాములు, కార్బండిజమ్ మాంకోజెబ్ 2.5 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న : సాళ్ల మధ్య నీరు తొలగించి, కలుపు తీయాలి. వర్షాలు తగ్గిన వెంటనే లీటరు నీటికి 20 గ్రాముల చొప్పున డీఏపీ లేదా 5 గ్రాముల 19:19:19 ఎరువును కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. వర్షాలు పూర్తిగా ఆగిపోయిన తరవాత ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలి.కంది : అధిక తేమ వల్ల మొక్కల్లో ఇనుపధాతువు లోపంతో ఆకులు పసుపు రంగులోకి మారి ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటిలో 5 గ్రాముల అన్నభేది, ఒక గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పంటపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షాలు ఆగిపోయాక ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

## 80 కి.మీ.. రూ.8 కోట్లు

కొత్తగూడెం : భారీ వర్షాలతో దాదాపు జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రధాన రహదారులు, వంతెనల అప్రోచ్ రోడ్లు ధ్వంసమయ్యాయి. చెరువులు ఉప్పొంగిన చోట చప్టాలు, వంతెనల రహదారులు కోతకు గురయ్యాయి. జిల్లాలో ర.భ. శాఖ ఆధ్వర్యంలో మొత్తం 1,635 కి.మీ. రహదారులున్నాయి. వర్షాలకు వీటిలో సుమారు 80 కి.మీ. పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలుచోట్ల దెబ్బతిన్న రహదారులను ఆ శాఖ ఈఈ భీమ్లా, డీఈ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులపై ఏఈలు, సిబ్బందికి సూచనలు చేశారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా, రోడ్లు మరింత దెబ్బతినకుండా ఇసుక బస్తాలు అడ్డుగా వేస్తున్నారు. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లిస్తున్నారు. దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక మరమ్మతులకు రూ.8 కోట్ల వరకు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మేరకు కలెక్టర్ ప్రియాంక ఆదేశాలతో ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఈఈ తెలిపారు.ధ్వంసమైన రహదారులు: బయ్యారం-తాడ్వాయి, అనిశెట్టిపల్లి-ఆళ్లపల్లి, ఆళ్లపల్లి-వెంకటాపురం, అనిశెట్టిపల్లి-అనంతోగు వంతెన అప్రోచ్, బయ్యారం-రంగాపురం, మైలారం-బంగారుచెలక.ప్రధాన వంతెనల అప్రోచ్‌లు: గుండాల మండలంలో సాయన్నపల్లి-ఏడు మెలికల వాగు వంతెన అప్రోచ్, బయ్యారం-తాడ్వాయి మధ్య వంతెన, గుండాల మండలంలోని మల్లన్న వాగు, లింగగూడెం వంతెనలు, అనిశెట్టిపల్లి-ఆళ్లపల్లి రోడ్డు మధ్య వంతెన.

# మిరప వైపు.. రైతుల మొగ్గు



ఖమ్మం : ఈ పంటకాలంలో వర్షాలు ఆలస్యంగా కురవటంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఏఏ జిల్లాల్లో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏఏ పంట విస్తీర్ణం పెరుగుతుంది/తగ్గుతుంది, అందుకు గల కారణాలను అన్వేషిస్తోంది. హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం డీఏఓలు ఎం.విజయనిర్మల, అభిమన్యుడు ఇక్కడి సాగు వివరాలను వెల్లడించారు.ఖమ్మం జిల్లాలో..గతేడాది ఈ సీజన్‌లో 2.90 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈసారి 2.77లక్షల ఎకరాలకు పరిమితమవుతుందని డీఏఓ విజయనిర్మల తెలిపారు. మిగిలిన ఎకరాల్లో 5వేల ఎకరాల్లో పెసర, 8వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్, ఇతర పంటల సాగు విస్తీర్ణం పెరగనుందని అంచనా వేశారు. సాగర్ జలాలపై పూర్తిగా ఆధారపడొద్దని, సాగునీరు ఆశాజనకంగా లేనిపక్షంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ సూచించింది. గతేడాది 2.21 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఈసంవత్సరం ఇప్పటివరకు 1.78 లక్షల ఎకరాల్లో పండిస్తున్నారు. సుమారు 40వేల ఎకరాల్లో మిరప సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. పత్తికి గిట్టుబాటు ధర లేకపోవటం, ఇప్పటికీ కొన్నిచోట్ల ఇళ్లల్లోనే నిల్వలు పేరుకుపోవటం, ఈ సీజన్‌లో వర్షాలు ఆలస్యం కావటం తదితరాలు ఇందుకు కారణమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది 65 వేల ఎకరాల్లో సాగైన మిరప ఈసారి 1.05 లక్షల ఎకరాలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఏడాది నుంచి మిరప ధర క్వింటా రూ.20వేల పైన ఉండటంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారని భావిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెంలో..

మొక్కజొన్న, పత్తి సాగు విస్తీర్ణం తగ్గింది. మిరప, ఆయిల్‌పామ్ లాంటి ఉద్యాన పంటల వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సహజంగా వానాకాలంలో ఈ జిల్లాలో పత్తి తర్వాత అత్యధికంగా మొక్కజొన్నను పండిస్తుంటారు. గతేడాది 1.62 లక్షల ఎకరాల్లో పత్తి పండించగా ఈసారి ఇప్పటివరకు 1.49లక్షల ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 50,910 ఎకరాల్లో సాగవగా ఇప్పటివరకు 39,333 ఎకరాలకు పరిమితమైంది. 6,288 ఎకరాల్లో కంది పండించగా ఈసారి 3,630 ఎకరాల్లోనే సాగైంది. గతేడాది 20 వేల ఎకరాల్లో మిరప సాగవగా ఈసారి మరో 10వేల ఎకరాల విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం 20 వేల ఎకరాలకు చేరవచ్చునని భావిస్తున్నారు.

# నెలపాటు.. వరదపోటు!



భద్రాచలం : వేసవిలో అడుగున్నర లోపు నీటిమట్టంతో బక్క చిక్కిపోయే భద్రాచలం గోదావరి ఇప్పుడు మహోగ్రరూపం దాల్చుతోంది. ఎగువన భారీ వర్షాలతో నడి రోడ్కెక్కి సవాల్ విసురుతోంది. మన్యంలో పలు చోట్ల ప్రధాన రహదారులపై వరద చేరడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. గత శతాబ్దం చరిత్రను పరిశీలిస్తే.. మూడో ప్రమాద హెచ్చరిక దాటిన ఘటనలు దాదాపు 20 సార్లు చోటు చేసుకున్నాయి. జూన్ నుంచి అక్టోబరు వరకు వరదల భయం పొంచి ఉంటుందని తెలుస్తోంది. ఎక్కువసార్లు ఆగస్టులోనే గరిష్ఠ వరద పోటెత్తుతోంది. దీన్నిబట్టి చూస్తే మరో నెలపాటు ప్రమాదం పొంచి ఉందన్నది సుస్పష్టం.

1986 ఆగస్టులో వచ్చిన వరద అత్యంత గరిష్ఠంగా నమోదై కేంద్ర జల సంఘం రికార్డులకు ఎక్కింది. రెండో అతి పెద్ద వరద గత ఏడాది జులైలో వచ్చింది. నీటిమట్టం వివరాలను పరిశీలిస్తే జులైలో గత ఏడాదితో పాటు 1988లోనే మూడో ప్రమాద హెచ్చరిక దాటడం విశేషం. 2016 జులైలో 52.4 అడుగులు రావడంతో మూడో హెచ్చరిక నమోదవలేదు. ఈసారి 53 అడుగులకు చేరుకుంటే జులైలో ఇదో రికార్డు కానుంది. ఒక ఏడాది గరిష్ఠ వరద నమోదైందంటే ఆ మరుసటి ఏడాది లేదా తర్వాత సంవత్సరం కానీ ప్రమాదకరమైన వరదలు వస్తుండడం గమనార్హం.

అందుబాటులో అత్యవసర వైద్యం: కలెక్టర్

జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. పాత కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. నిరాశ్రయులను అతిథులుగా భావించి నాణ్యమైన భోజనం, శుద్ధి జలాలు అందించాలని సూచించారు. అనంతరం ఎస్సీ కాలనీ, రామవరం సుభాష్‌చంద్రబోస్ నగర్(ఎస్సీబీనగర్) లో ఆమె పర్యటించారు. ప్రభుత్వ సెలవులు ఉన్నందున నిండుకుండల్లా మారిన జలాశయాలు, వాగులు, నదుల వద్దకు పర్యాటకులు, యువత, విద్యార్థులు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్థానిక అధికారులను ఆదేశించారు. భద్రాచలం గోదావరి, కిన్నెరసాని, తాలిపేరు, మూకమామిడి, ఇతర ప్రాజెక్టుల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. చెరువులు, వాగుల్లో చేపల వేట, ఈతకు అనుమతించొద్దన్నారు. పిల్లలు వాగులు, వంకల వద్దకు వెళ్లి ప్రమాదాలబారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఎస్పీ రెహమాన్, ఛైర్‌పర్సన్ సీతాలక్ష్మి, తహసీల్దార్ శర్మ, మున్సిపల్ కమిషనర్ రఘు, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. గుమ్మడవల్లి సమీపంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 600 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తున్నట్లు నిర్వహణ ఏఈఈ కృష్ణ తెలిపారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 19.3 అడుగుల ఎత్తులో 0.6 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.6 అడుగుల ఎత్తులో సుమారు 0.4 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏఈఈ తెలిపారు.

# మూడేళ్ల నిర్లక్ష్యానికి నిదర్శనం

ములుగు: మూడేళ్ల క్రితం 2020లో కురిసిన భారీ వర్షాలకు రామప్ప సరస్సు ఉధృతంగా మత్తడి పోసింది. ప్రవాహ ధాటికి ములుగు-జంగాలపల్లి మధ్య 163 జాతీయ రహదారిపై వరద నీరు చేరి ఇద్దరు యువకులు ప్రమాద బారిన పడ్డారు. రాకపోకలు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఏటా వర్షాకాలంలో ఇదే సమస్య నెలకొంటోంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న రామప్ప సరస్సు మత్తడి మార్గం చిన్నగా ఉండడమే ఇందుకు కారణం. సుమారు 3 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన సరస్సుకు కేవలం 40 మీటర్ల వెడల్పు గల మత్తడి ఉంది. దీంతో నీరు సాఫీగా బయటకు వెళ్లడం లేదు. ఫలితంగా ఏటా జాతీయ రహదారిపై వరద నీరు చేరుతున్నా.. జిల్లా అధికార యంత్రాంగంలో మార్పు కనపడడం లేదు. అధికారులను అప్రమత్తం చేస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో 'రామప్ప మత్తడి విస్తరణకు మోక్షమెప్పుడో' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన ఫలితం లేకుండా పోయింది. ఇకనైనా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

రామప్ప మత్తడిని వెడల్పు చేయడం కోసం నీటి పారుదలశాఖ అధికారులు ఏడాది క్రితమే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈఎన్‌సీకి పంపించినా ఫలితం లేదు. అధికారులు మాత్రం నిధులు కేటాయించకపోవడం వల్లే పనులు ముందుకు సాగడం లేదని పేర్కొంటున్నారు. ఏటా పంట పొలాలు, ఊళ్లు, రోడ్లు, జాతీయ రహదారులు వరద నీట మునుగుతున్నాయి.



వర్షాకాలం వచ్చిందంటే సమీప గ్రామాల ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఇలా చేస్తే మేలు ప్రస్తుతం 40 మీటర్ల వెడల్పు ఉన్న రామప్ప సరస్సు మత్తడిని సుమారు 100 మీటర్లకు పెంచాలి. మత్తడి నీరు ఆయకట్టు పరిధిలోని పంట పొలాల మీదకు వెళ్లకుండా మోరంచవాగు వరకు ప్రత్యేక కెనాల్ ఏర్పాటు చేయాలి. జాతీయ రహదారిపై జంగాలపల్లి క్రాస్ నుంచి మేడివాగు, ములుగు జిల్లా కోర్టు ప్రాంతంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలి. ఇంచర్ల, పాపయ్యపల్లి, సింగరకుంటపల్లి గ్రామాలకు ముంపు సమస్య లేకుండా రక్షణ గోడ నిర్మించాలి. పాపయ్యపల్లి, సింగరకుంటపల్లి గ్రామాల్లో వరద ప్రభావం ఉన్న చోట వంతెన ఏర్పాటు చేయాలి.

# పండుటాకులను పట్టించుకోరా..?

కరీంనగర్ : కాళ్లు, చేతులు బాగున్నన్ని రోజులు స్వార్థం చూసుకోకుండా నా కుటుంబం బాగుండాలని పరుగులు పెట్టారు. కాలం గడిచే కొద్దీ శరీరం పట్టుతప్పి సహకరించడం లేదు. వృద్ధాప్యం వెతుక్కుంటూ రాగా వారి కష్టాలు కడదాక కొనసాగుతూనే ఉన్నాయి. నా అన్నవాళ్లు లేని మలి వయసుతో కొందరు.. కుటుంబ సభ్యుల పట్టింపులేమితో మరికొందరు ఆశ్రయం పొందుతున్నారు. చిన్నతనం నుంచే చూపులేని అంధులు, శారీరక వైకల్యం వారు ప్రభుత్వ ఆశ్రమంలో చేరుతుండగా తీవ్ర అసౌకర్యాల నడుమ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

సమస్యలతో సతమతం

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల తర్వాత ప్రభుత్వ వృద్ధులు, దివ్యాంగుల ఆశ్రమం కరీంనగర్‌లోనే ఉంది. 60 మంది సామర్థ్యం ఉన్న ఈ ఆశ్రమంలో ప్రస్తుతం 21 మంది వృద్ధులు, 22 మంది దివ్యాంగులు, 13 మంది అంధులు కలిపి మొత్తం 56 మంది ఉన్నారు. సుమారు ముప్పై ఏళ్ల కింద నిర్మించిన భవనాలు నాలుగు ఉండగా, మరో నాలుగు భవనాలు ఆరు నుంచి పది సంవత్సరాల కిందట నిర్మించినవి ఉన్నాయి. వర్షాలకు పాత భవనాల పైకప్పు, శిథిలావస్థలో ఉన్న కిటికిల్లోంచి నుంచి నీరు గదుల్లోకి చేరుతోంది. పక్కనే ఉన్న శశ్మాన వాటిక నుంచి పెద్ద ఎత్తున వరద ఆశ్రమం ఆవరణలోకి వస్తోంది. కొన్ని భవనాలకు మరమ్మతులు చేసినా.. పైనుంచి పెచ్చులూడుతున్నాయి. ఆశ్రమం ప్రహరీ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది.

అసౌకర్యంగా మరుగుదొడ్లు

ఆశ్రమంలో సరిపడా మరుగుదొడ్లు లేవు. వెస్టన్ టైపు మరుగుదొడ్డి



ఒక్కటి మాత్రమే ఉండడంతో శరీరం సహకరించని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలోనే స్థానిక మంత్రి గంగుల కమలాకర్ సమస్య తీవ్రతను గుర్తించి, రూ.10 లక్షలు మంజూరు చేశారు. పలు మరుగుదొడ్లు నిర్మాణ దశలోనే ఉన్నాయి.

సిబ్బంది కొరత

ఆశ్రమంలో వార్డెన్ సెలవులో ఉన్న సమయంలో విధుల్లో మరొకరు ఉండట్లేదు. వైద్య సేవల కోసం విధుల్లో ఉండాల్సిన నర్సు వచ్చినప్పుడు మాత్రమే వైద్యం. ఆమె సెలవులో ఉంటే మరొకరు రావడం లేదు. ఆహార వస్తువులు సరఫరా చేసే వారికి ఆరు నెలలకు ఒకసారి బిల్లులు చెల్లిస్తుండడంతో వారు సరఫరా చేసే వస్తువుల నాణ్యతను ప్రశ్నించే అవకాశం లేకుండా పోతోందని సిబ్బంది వాపోతున్నారు. గ్యాస్, బియ్యం రవాణా ఛార్జీలను సంబంధిత వార్డెన్ ముందుగా చెల్లించి, నిధులు విడుదల తర్వాత తిరిగి తీసుకుంటున్నారు.

ఐదేళ్లుగా సందర్శనలతోనే సరి

అధికారులు సందర్శిస్తున్నారు.. ఆశ్రమంలో సమస్యలున్నట్లు గుర్తిస్తున్నారు.. పరిష్కరిస్తామని భరోసా కల్పిస్తున్నారు కానీ.. ఫలితం దక్కడం లేదు. మూడేళ్ల కింద రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ ఆశ్రమాన్ని సందర్శించారు. 'ఇన్ని ఇబ్బందుల మధ్య ఎలా ఆశ్రమాన్ని కొనసాగిస్తున్నారు? వెంటనే ఆశ్రమంలోని సమస్యలన్నీ పరిష్కరించండి. కోటి రూపాయలైనా నిధులు విడుదల చేయిస్తా' అని భరోసా కల్పించారు. ఆమె సూచనల మేరకు వెనువెంటనే అప్పటి కలెక్టర్ సైతం ఆశ్రమాన్ని సందర్శించారు. కొన్ని భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయడానికి సైతం పనికిరావని, వెంటనే ఇక్కడి నుంచి నెలరోజులలోపు ఆశ్రమాన్ని అద్దె భవనంలోకి మార్చాలని అప్పుడున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆర్డీవో కొద్ది నెలల పాటు అద్దె భవనాల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఐదేళ్లు గడిచిపోయినా వృద్ధుల సమస్యలు తీరడం లేదు.

కొత్త భవనంతోనే పరిష్కారం

వానాకాలంలో గదుల్లోకి నీరు వస్తోంది. మంచం దిగుదామంటే భయంగా ఉంటుంది. మరుగుదొడ్ల సమస్య ఉంది. పాత భవనానికి ఎన్ని మరమ్మతులు చేసినా కష్టమే. కొత్త భవన నిర్మాణంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. లక్ష్మి, వృద్ధురాలు

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

వర్షాకాలం సమస్యలతో పాటు అనేక ఇబ్బందులున్నాయి. పాత భవనాల మరమ్మతులతో సమస్యలన్నింటికీ పరిష్కారం లభించే అవకాశం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం. సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారిణి

## తీగల వంతెన అప్రోచ్ రోడ్డుకు బీటలు

కరీంనగర్ : ప్రారంభించి నెలరోజులు గడవక ముందే తీగల వంతెన అప్రోచ్ రహదారి పలుచోట్ల బీటలు వారుతోంది. దాని ప్రహరీకి సైతం భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. రాజీవ్ రహదారికి ఆనుకుని తీగల వంతెన వరకు అనుసంధాన రహదారిని రోడ్లు భవనాల శాఖ నిర్మించింది. ఫుట్‌పాత్, ఇతర పనులు జరుగుతూనే ఉన్నాయి. రూ.224 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెనను గత నెల 21న మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కరీంనగర్



నుంచి వరంగల్ వెళ్లేందుకు రహదారి దూరాన్ని తగ్గించడంతో పాటు పర్యాటక కేంద్రంగా నిలిచేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తారు రోడ్డు దెబ్బతింటోంది. రహదారికి ఆనుకుని ఉన్న సిమెంట్ గోడలకు పగుళ్లు ఏర్పడుతుండగా పర్యాటకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు నిర్మాణ లోపాలపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై ర.భ.శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు సాంబశివరావుని వివరణ కోరగా.. పలుచోట్ల రోడ్డు కుంగిన విషయం వాస్తవమేనన్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో మట్టి కొద్దిగా అప్రోచ్ రోడ్డు లోపలి భాగాలకు సర్దుబాటు అవుతుందన్నారు. పగుళ్లను సరి చేస్తామని తెలిపారు.

# మన ఊరు–మన బడి పనుల్లో జాప్యం

మల్యాల : పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా గుత్తేదారులు ప్రారంభించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్వరలోనే పనులను పూర్తి చేయాలని జిల్లా పాలనాధికారి సంబంధిత అధికారులను ఆదేశించిన నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే పనులు చురుకుగా సాగుతున్నాయి. మల్యాల మండలంలోని రాంపూర్, మద్దుట్ల, రామన్నపేట, మల్యాల, మ్యాడంపల్లి, తక్కళ్లపల్లి, తాటిపల్లి, బల్వంతాపూర్ గ్రామాల్లోని జడ్పీ, ఎంపీపీఎస్ పాఠశాలల్లో విద్యుత్తు పనులతోపాటు గదుల మరమ్మతు, ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించారు. దాదాపు అన్ని పాఠశాలల్లో విద్యుత్తు పనులు పూర్తయ్యాయి. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ప్రధాన మరమ్మతు



పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

మండలంలోని 14 పాఠశాలల్లో ఆయా పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ.1,41,66,076 మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పాఠశాలల ఆవరణలో డైనింగ్ హాలు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.14 లక్షల చొప్పున మంజూరు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఏ పాఠశాలలో పనులు ప్రారంభించలేదు. పలు పనులు ప్రగతిలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నా వాటిని పూర్తి చేయడానికి నెలల సమయంపట్టవచ్చని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో గతంలో నిర్మించిన మరుగుదొడ్లను కూల్చి కొత్త నిర్మాణాలు చేపట్టగా, మరికొన్ని గ్రామాల్లో ఎన్టీపీసీ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను వినియోగించుకోకుండా వాటికి తాళం వేశారు. వాటిపక్కనే మళ్లీ కొత్తగా మరుగుదొడ్డి నిర్మిస్తున్నారు. మండలంలోని కొన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంట్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు బోరు నీటిని తాగుతున్నారు. తాటిపల్లిలో పాఠశాల ముందుగల ఓ ప్రైవేటు శుద్ధజల కేంద్రం నుంచి రూ.2కు నీటిని కొనుక్కుని తాగుతున్నట్లు సిబ్బంది తెలిపారు. తరగతి గదుల్లోని స్లాబ్‌లలో వైరింగ్ అమర్చడానికి గతంలోనే పైపులు వేసినప్పటికీ లోపలి నుంచి కాకుండా సీలింగుకు పైనుంచి పైపులను అమర్చి విద్యుత్తు పనులు పూర్తి చేశారు. ఉపాధి హామీ పథకం కింద ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటివసతి, వంట గదులు, ప్రహరీ నిర్మాణం కోసం దాదాపు రూ.1.20 కోట్లతో పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నా పనుల్లో జాప్యం జరుగుతోంది. రామన్నపేటలో మాత్రం పనులు త్వరిగతిన పూర్తి చేయించి ఈనెల 15 లోగా ప్రారంభించాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం– శ్రీనివాస్, మండల విద్యాధికారి, మల్యాల మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 'మన ఊరు–మన బడి' కార్యక్రమం కింద చేపట్టిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ సైట్‌లో పొందుపరుస్తున్నాం. ఆయా పనులను పూర్తిచేయించడంతోపాటు వాటి నాణ్యతను పరిశీలించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అధికారులదే. కొన్ని పాఠశాలల్లో ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టడానికి ప్రజాప్రతినిధులు, గుత్తేదార్లు ఆసక్తి చూపడంలేదని తెలిసింది. దీంతో ఆయా పనులు ముందుకు సాగడంలేదు.

# సాంకేతికత జోడించి.. పారదర్శకత పెంచి

మల్యాల : వలసలు తగ్గించి ఉన్న చోటనే ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ ఉపాధిహామీలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. పనులు చేయకుండానే నిధులు పక్కదారిపడుతున్నట్లు సామాజిక తనిఖీలో వెలుగులోకి వస్తున్నాయి. పల్లెల సమగ్రాభివృద్ధికి కీలకమైన నిధుల అక్రమాలను ప్రతిపాదనల దశలోనే నియంత్రించేందుకు కేంద్రం సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాదికి సంబంధించి పనుల ప్రతిపాదనల్లో పారదర్శకత పాటిస్తున్నారు. ఇప్పటి వరకు పని సామర్థ్యం కోసం ఎంత వ్యయం ఖర్చు అవుతుందో అంచనా ప్రతిపాదించేవారు. కొత్త విధానం ప్రకారం సిబ్బంది క్షేత్ర స్థాయిలోకి వెళ్లి అక్షాంశ, రేఖాంశాల ద్వారా ఫోటోలను ఆన్‌లైన్‌లో ప్రతిపాదిస్తున్నారు. జాతీయ స్థాయిలో నిక్షిప్తం కావడంతో పర్యవేక్షణ పెరగనుంది. పనులు చేయకుండా బిల్లుల స్వాహాకు అడ్డుకట్ట పడనుంది.గతంలో అనుమతి పొందేది ఇలా..

ఉపాధిహామీలో ఇప్పటి వరకు ఎంపిక చేసిన పనుల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. సాంకేతిక సహాయకుడు గ్రామాల్లోకి వెళ్లి ఆయా పని సామర్థ్యం బట్టి అంచనా ప్రతిపాదనలు చేసి నివేదించేవారు. ప్రజలకు ఎలాంటి అవసరం లేని పనులకు ఇష్టారీతిలో అంచనా వ్యయాన్ని కేటాయించిన ఘటనలున్నాయి. పని సామర్థ్యం



వేలల్లో ఉంటే లక్షల నిధుల కోసం సిఫార్సు చేసేవారు. కూలీలు, సామగ్రికి వేర్వేరుగా ఎంత ఖర్చవుతుంతో లెక్కించేవారు. గ్రామ స్థాయిలో సేకరించిన ప్రతిపాదనల అనుగుణంగా అనుమతి లభించేది.

బోగస్ పనులకు అడ్డుకట్ట

ఈ ఏడాది వార్షిక ప్రణాళిక కోసం సాంకేతిక విధానాన్ని అమలు చేస్తున్నారు. పల్లెల్లో ఇబ్బడిముబ్బడిగా పనుల మంజూరు ఉండేది. ఇలాంటి అవకతవకలకు కళ్లెం వేసేందుకు ప్రతి ఊరిలో ప్రాధాన్యత ఉన్న ఇరవై పనులనే ఎంపిక చేస్తున్నారు. ఆయా పనులు పూర్తయితేనే మళ్లీకొత్తగా మంజూరు చేయనున్నారు. ఎంపిక చేసిన పనుల వద్దకు వెళ్లిన సిబ్బంది అక్షాంశ, రేఖాంశాల ద్వారా ఫోటోలు చిత్రీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. కొత్త పద్ధతిలో ఏ పని చేయాలన్నా ఆన్‌లైన్ ప్రతిపాదన ఆధారం కానుంది. పనులు చేసే సమయంలో కూడా ఆన్‌లైన్‌లో ప్రగతి నివేదికలు ఆధారం కానున్నాయి. కొత్త విధానంతో బోగస్ పనులకు ఆస్కారం ఉండదు. నిధుల స్వాహాకు అడ్డుకట్ట పడనుంది.

ఫొటో చిత్రీకరిస్తున్నారుఉపాధిహామీలో ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లో చేస్తున్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి గ్రామాల్లో ఎంపిక చేసిన పనులకు అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా ఫోటో చిత్రీకరిస్తున్నారు. కొత్త విధానంతో బోగస్ పనులు లేకుండా పారదర్శకత రానుంది. శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి

# పచ్చని పొలాల్లో అక్రమ వెంచర్లు



మల్యాల : అక్రమ వెంచర్లతో ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. ప్రజా అవసరాలకు ఉపయోగించేందుకు వెంచరులో 10 శాతం స్థలం గ్రామ పంచాయతీకి అప్పగించాలి. దానిని కూడ స్థిరాస్తి వ్యాపారులు అమ్ముకుని జేబులు నింపుకొంటున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న సమయంలోనే ఇలాంటి వాటిని నియంత్రిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు ప్రజా ప్రయోజనాలకు స్థలం సైతం ఉండేది. ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి ప్లాట్ల కొనుగోలుదారులు నష్టపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఫలితంగా కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాలైన సారంపల్లి, నేరెల్ల, మండెపల్లి, బద్దెనపల్లి, పద్మనగర్, తాడూరు, లక్ష్మీపూర్, అంకుసాపూర్, చీర్లవంచ తదితర గ్రామాల్లో పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు వెలిశాయి. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే క్రయ, విక్రయాలు కొనసాగుతున్నాయి. మండలంలో ఒక్క వెంచర్‌కు మాత్రమే అనుమతి ఉంది. గతంలో అక్రమ వెంచర్లపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆందోళనలు చేపట్టడం, వెంచర్లల్లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు అనుమతి లేని వాటి సర్వే నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రారంభంలోనే ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

భూ మార్పిడి కాకుండానే...

వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు మార్చే సమయంలో రెవెన్యూశాఖకు నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. స్థిరాస్తి వ్యాపారులు కట్టడం లేదు. ఫలితంగా తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు పద్మనగర్, మండెపల్లి, సారంపల్లి, బద్దెనపల్లి, తాడూరు, అంకుసాపూర్ తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో భూ మార్పిడి జరగకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించే పరిస్థితి నెలకొంది. దీనిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు చర్యలకు ఉపక్రమించాల్సి ఉన్నా ఫిర్యాదులు వస్తేకాని చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమ వెంచర్లతో ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. ప్రజా అవసరాలకు ఉపయోగించేందుకు వెంచరులో 10 శాతం స్థలం గ్రామ పంచాయతీకి అప్పగించాలి. దానిని కూడ స్థిరాస్తి వ్యాపారులు అమ్ముకుని జేబులు నింపుకొంటున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న సమయంలోనే ఇలాంటి వాటిని నియంత్రిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు ప్రజా ప్రయోజనాలకు స్థలం సైతం ఉండేది. ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి ప్లాట్ల కొనుగోలుదారులు నష్టపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అనుమతి లేకుండానే..మండలంలో నేరెల్లలోని ఓ వెంచర్‌కు పూర్తిస్థాయిలో అనుమతి రాకుండానే బోర్డులు పెట్టి ఇప్పటికే విక్రయాలు కొనసాగించారు. అలాగే తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు, నేరెల్ల, బద్దెనపల్లి, మండెపల్లి, సారంపల్లి గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారులు శ్రీగంధం చెట్ల పేరిట ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీసిన సందర్భాలున్నాయి. కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లకు ఏకంగా పేర్లు పెట్టి ప్లాట్లను విక్రయిస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇది ఒక్క తంగళ్లపల్లి మండలంలోనే కాదు. జిల్లా కేంద్రంలోని పట్టణం నలుమూలలా ఇలా వెలశాయి. తంగళ్లపల్లి మండలంలో మొత్తం 127 వెంచర్లు ఉండగా అందులో మండల కేంద్రంలో సగానికి పైగా ఉండటం గమనార్హం.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం– లచ్చాలు, ఎంపీడీవో, తంగళ్లపల్లి ప్రభుత్వ అనుమతి లేకుండా వెలసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దు. కొంత మంది అనుమతి ఉన్నట్లు తప్పుదారి పట్టిస్తారు. ఎవరూ నమ్మవద్దు. పాట్లు కొనుగోలు చేసే ముందు వెంచరుకు అనుమతి ఉందా? లేదా? అని తెలుసుకొని కొనుగోలు చేసుకోవాలి. అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# రాజభాషకు ప్రాధాన్యం.. ఎన్టీపీసీ ఆదర్శం



మల్యాల : స్వాతంత్రోద్యమ సమయంలో హిందీ భాష దేశాన్ని ఒక్కటి చేసింది. ఈక్రమంలో హిందీ ప్రాధాన్యతను చాటడానికి 1975 జనవరి 10న నాగ్‌పూర్‌లో విశ్వహిందీ సమ్మేళనం నిర్వహించారు. ప్రతి ఏటా ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్టీపీసీ ప్రాంతంలో హిందీ భాష అమలుకు ప్రాధాన్యం పెరిగింది. సెప్టెంబరు 14 నుంచి సెప్టెంబరు 29 వరకు హిందీభాషపై పక్షోత్సవాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పట్టు సాధించేందుకు..హిందీభాషపై ప్రతి ఒక్కరు పట్టు సాధించటానికి హిందీలో టైప్‌రైటింగ్, క్విజ్, పాటలు, ప్రత్యుత్తరాలు, చదవడం, రాయటం, వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాఠశాలల విద్యార్థులను పోటీలకు ఆహ్వానించి రాజభాష సాహిత్యాన్ని విస్తృతం చేస్తున్నారు.

దక్షిణాదిలో తొలిసారి...దక్షిణ భారతదేశంలో ఎన్టీపీసీ పరిశ్రమలో మొట్టమొదటిసారిగా 'రాజభాష గౌరవ్ సమ్మాన్' అవార్డును రామగుండం అదనపు జీఎం విజయలక్ష్మి అందుకున్నారు. అధికార భాష అమలులో తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. రామగుండం అదనపు జీఎం మరాఠీ, తెలుగు, తమిళం, ఒడియా, హిందీ, ఆంగ్లం, బెంగాలీ భాషల్లో ప్రావీణ్యత పొందారు. 2022 మే మాసంలో 21 మంది ఎన్టీపీసీ ఉద్యోగులు సమాంతరంగా హిందీ ప్రబోధ్, ప్రాగ్యా, పారంగత్ పరీక్షలు రాయగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు. డిసెంబరులో నిర్వహించిన పారంగత్‌లో 13 మంది పరీక్షలు రాసి 9 మంది ఉత్తీర్ణత సాధించారు. వచ్చే మే నెలలో నిర్వహించనున్న పరీక్షలకు 19 మంది సిద్ధమవుతున్నారు.

ప్రత్యేక తరగతులు...

ఎన్టీపీసీ సౌజన్యంతో ఇటీవల ఈ ప్రాంతంలో ప్రపంచ హిందీ సెక్రటేరియట్ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధాన కార్యదర్శి మిశ్రా ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు.

సంచిక విడుదలకు ఏర్పాట్లు...ప్రపంచ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీపీసీ ప్రాంతంలో యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. జ్యోతిస్వర్ అనే ప్రత్యేక సంచికను విడుదల చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరగనుంది.

ద్వితీయ భాషతో..– ఆశాలత, హిందీ పండిట్‌హిందీని ద్వితీయ భాషగా ఎంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగ సాధనలో ప్రత్యేక ప్రాధాన్యం పొందవచ్చు. కళాశాలల్లో ప్రస్తుతం 10 శాతం మంది విద్యార్థులు రెండో పాఠ్యాంశంగా హిందీని ఎంపిక చేసుకుంటున్నారు. హిందీ భాషకు సంబంధించిన సర్టిఫికెట్ ఉంటే బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాలు, వివిధ పరిశ్రమల్లో తేలికగా ఉద్యోగాలు సాధించే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ తదితర దేశాల్లో హిందీ విశ్వవిద్యాలయాలు సైతం ఉన్నాయి. హిందీ భాషను మన దేశంలో 90 శాతం మంది అర్థం చేసుకుంటారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీలతోపాటు పీహెచ్‌డీలో ప్రత్యేక పాఠ్యాంశంగా హిందీ తీసుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# కొలత యంత్రాల కొరత

ఇల్లెందు : ఇల్లెందు బీఎంసీయూ పరిధిలో ఇల్లెందు మండలం ముకుందాపురం, ధనియాలపాడు, టేకులపల్లి మండలం టేకులపల్లి, సులానగర్, బేతంపూడి, బోడు తదితర గ్రామాల్లో విజయ డెయిరీ పాలు సేకరిస్తుంది. కానీ స్థానికంగానే పాలల్లో కొవ్వు, నీళ్ల శాతం కొలవడం లేదు. సేకరించిన పాలను ఇల్లెందు బీఎంసీయూకు తరలించి అక్కడ పాలల్లో కొవ్వు శాతం లెక్కిస్తున్నారు. దీనికి కారణం పాలు సేకరించే గ్రామాల్లో ఎనలైజర్లు లేకపోవడమే.విజయ డెయిరీ పరిధిలో పాలల్లో కొవ్వు, నీటి శాతం కొలిచే మిషన్ల కొరత తీవ్రంగా నెలకొంది. పాల సేకరణ కేంద్రాల పెంపుదలకు అనుగుణంగా ఎనలైజర్ల సంఖ్య పెంచకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ మిషన్ల ద్వారా పాలల్లో కొవ్వు, నీళ్ల శాతం కొలిచి వాటి ఆధారంగా పాడి రైతులకు ధర నిర్ణయిస్తుంటారు. కానీ మిషన్లు లేకపోవడంతో పాడిరైతుల సమక్షంలో పాలల్లో కొవ్వు శాతం కొలవడం లేదు. పలు గ్రామాలు తిరిగి పాలు సేకరించిన ఆటో సుమారు నాలుగైదు గంటల తర్వాత బీఎంసీయూకు వెళ్లి పాలల్లో కొవ్వు శాతం చూస్తుంటారు. ఒక్కోసారి పాడిరైతుల బాటిళ్లు అటు, ఇటు కూడా మారుతుంటాయి. తమ కళ్లెదుటే తమ పాలల్లో కొవ్వు శాతం చూడాలని లబ్ధిదారుల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే ఒక్కో మిషన్ ధర సుమారు రూ.1.35 లక్షలు కావడం గమనించాల్సిన అంశం.

# కేసుల పురోగతి.. ప్రవర్తనపై ఆరా!

భూపాలపల్లి : పోలీసు శాఖ స్నేహపూర్వక సేవలు అందిస్తోంది. ప్రతి ఠాణాలో ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని ఆదేశించింది. అవినీతికి ఆస్కారం లేకుండా కేసులు పరిష్కరించాలని నిర్దేశించింది. సిబ్బంది పనితీరు మెరుగుపర్చేందుకు పలు సంస్కరణలు తీసుకొచ్చింది.. అయినా కొంతమంది వ్యవహరిస్తున్న తీరుతో శాఖకు చెడ్డ పేరు వస్తోందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో వివిధ ఠాణాల్లో ఫిర్యాదు చేసిన బాధితులకు హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ నుంచి నేరుగా ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. మీ కేసు పురోగతి ఎలా ఉంది..? స్టేషన్లో సిబ్బంది మీతో మర్యాదగా ప్రవర్తించారా..? మీతో పోలీసులు ఏమన్నారు..? స్టేషన్ హౌస్ అధికారిగా ఎవరున్నారు.. మీ సమస్యపై ఏవిధంగా స్పందించారు.. లంచం అడిగారా..? విచారణ వేగవంతంగా సాగుతోందా అని వివరాలు తెలుసుకుంటున్నారు. ఎప్పుడెవరికి ఫోన్ చేస్తారో తెలియక.. అవినీతి, అక్రమాలకు పాల్పడేవారు, ఫిర్యాదుదారులతో దురుసుగా ప్రవర్తించే పోలీసులకు భయం పట్టుకుంది.

జిల్లా కేంద్రంలో ఇటీవల ఓ ఇంట్లో చోరీ జరిగింది. కమాండ్ కంట్రోల్ నుంచి ఫిర్యాదుదారుడికి ఫోన్ చేసి సొత్తు విషయంలో ఏమైనా పురోగతి ఉందా.. అని తెలుసుకున్నారు. రికవరీ జరిగినట్లు మీకు సమాచారం ఇచ్చారా..? అనే విషయాలు సేకరించారు. ఓ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి ఒక గొడవ విషయంలో రెండు నెలల క్రితం స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఫిర్యాదుదారుడికి కంట్రోల్ కేంద్రం నుంచి ఫోన్ వచ్చింది. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై వివరాలు అడిగారు. పోలీసులు ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. బాధితుడు తనకు జరుగుతున్న అన్యాయాన్ని వెల్లడించినట్లు సమాచారం.

వివరాలు గోప్యంముఖ్యంగా కొంత మంది నేతల కనుసన్నల్లో పోలీసులు పని చేస్తున్నా రనే విమర్శలున్నాయి. మరికొందరు మామూళ్లకు అలవాటుపడి కేసులను తప్పుదోవ పట్టిస్తున్న తీరు వెలుగుచూస్తోంది. ఇటీవల జిల్లాలోని కొందరు పోలీసులు ఫిర్యాదుదారుల అవతలి పార్టీ నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఫోన్ రాగానే బాధితులు మొదటగా వివరాలు చెప్పాలా వద్దా.. అని వెనకాడారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పిస్తుండటంతో తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తున్నారు.

ఫిర్యాదు ఆధారంగా పోలీసుస్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్‌లోని వివరాల ఆధారంగా కమాండ్ కంట్రోల్ నుంచి బాధితులతో మాట్లాడుతున్నారు. కేసు ఎప్పుడు నమోదైంది.. న్యాయం జరిగిందా.. లేదా..? అనే విషయాలు తెలుసుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నారు. ఫిర్యాదుదారులతో దురుసుగా ప్రవర్తించినట్లు తేలితే శాఖాపరమైన విచారణ చేపట్టి ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

తప్పని గుబులు

ఖాకీల పనితీరుపై నిరంతరం వివరాలు సేకరిస్తుండటంతో పలువురిలో గుబులు మొదలైంది. ప్రధానంగా ఠాణాల్లో పనిచేసే ఎస్‌హెచ్‌వోతో పాటు రిసెప్షన్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పనితీరును ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటున్నారు. ఫిర్యాదుదారులు ఎక్కువగా రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో పాటు ఎస్‌హెచ్‌వోను ఎక్కువగా సంప్రదించే అవకాశం ఉంటుంది. వీరి పనితీరుపైనే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. స్పందించకపోయినా బాధితులకు నష్టం జరిగే అవకాశం ఉంటుంది.

వర్టికల్ నిర్వహణపై..వర్టికల్ విధానంపైనా ఆరా తీస్తున్నారు. రాష్ట్రంలోని పోలీసు శాఖ కొత్త పద్ధతులు తీసుకొచ్చింది. వాటిని పాటించడం ద్వారా సేవలు మెరుగ్గా ఉంటాయని భావించింది. దాని కోసం 14 రకాల విధానాన్ని అమలుచేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. దీన్ని ప్రతి ఠాణాలో పాటించాలని ఆదేశాలు సైతం జారీ చేసింది. వాటి నిర్వహణ ఆధారంగానే స్టేషన్లకు మార్కులు కేటాయిస్తున్నారు. మార్కుల ద్వారా ర్యాంకులు సైతం నిర్ణయిస్తున్నారు. రిసెప్షన్‌లో పనిచేసే సిబ్బంది పనితీరు, స్టేషన్ రైటర్‌లు, క్రైమ్ రైటర్‌లు, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్, కోర్టు డ్యూటీ సిబ్బంది, టెక్నికల్ బృందం, క్రైం స్టాఫ్, ఎంసీ సిబ్బంది, సెక్షన్ బాధ్యులు, జనరల్ డ్యూటీ సిబ్బంది, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్, అడ్మిన్ ఎస్సైల పనితీరు ఆధారంగా మార్కులుంటాయి. వీటి నిర్వహణ ఏవిధంగా ఉందన్న విషయాలపైనా కమాండ్ కంట్రోల్ నుంచి వివరాలు సేకరిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో సత్ప్రవర్తనతో మెలుగుతున్నారా.. లేదా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.

# ఉత్పత్తిలో మణుగూరు.. రవాణాలో గూడెం

మణుగూరు : సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్య ఛేదనకు 80 రోజులే గడువు ఉంది. గడిచిన తొమ్మిది నెలల కాలంలో లక్ష్య సాధనలో భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు ఏరియాలు ముందు ఉన్నాయి. ఈ రెండు ఏరియాలు ఉత్పత్తి, రవాణాలో లక్ష్యాన్ని అధిగమించి పోటీపడుతున్నాయి. గత ఏడాది ఎన్నడూ లేనంతంగా వర్షాలు కురిశాయి. దీంతో బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్య సాధన సాధ్యమవుతుందా? లేదా? అనే అనుమానాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో గత మూడు నెలల్లోనే బొగ్గు ఉత్పత్తి అమాంతం పెరిగింది. ఆ దిశగానే బొగ్గుని రవాణా చేశారు.

గడువు కంటే ముందే..బొగ్గు ఉత్పత్తిలో మణుగూరు ఏరియా సింగరేణి వ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. 115 శాతం ఉత్పత్తితో ప్రథమ స్థానంలో ఆర్జీ–1 ఉండగా, 108 శాతంతో మణుగూరు ఏరియా ఆ తరువాత నిలిచింది. 2022–23 నాటికి మణుగూరు ఏరియా నుంచి 116 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించగా, ఇప్పటికే 91,39,35 టన్నులు వెలికతీశారు. అయితే ఓసీ–2, ఓసీ–4 మణుగూరు ఓసీ గనులు వంద శాతం ఉత్పత్తి లక్ష్య సాధనలో కొనసాగుతున్నాయి. గడువు కంటే ముందే మరో రెండు నెలల్లో స్థానిక గనులు వార్షిక లక్ష్యాన్ని సాధించే అవకాశం లేకపోలేదు.కొత్తగూడెం ఏరియా నుంచి అధిక బొగ్గు రవాణా జరిగింది. ఉత్పత్తి సాధనలో కొంత వెనుకబడి ఉన్నా రవాణాలో ప్రథమ స్థానంలో ఉంది. ఉత్పత్తి ఎంత ముఖ్యమో, ఆ సరకును వినియోగదారులకు అందించటం కూడా అంతే ప్రాధాన్యం. ఉత్పత్తి అయిన బొగ్గు రోడ్డు, రైలు ద్వారా సిమెంటు, విద్యుదుత్పత్తి ప్లాంట్లకు, ఐటీసీ వంటి పరిశ్రమలకు తరలివెళ్తాయి. కొత్తగూడెం ఏరియా నుంచి ఇప్పటివరకు 92,59,026 టన్నుల బొగ్గు రవాణా జరిగింది. తరువాతి స్థానంలో మణుగూరు ఏరియా ఉంది. గూడెం నుంచి 586 వ్యాగన్ల ద్వారా రోజుకి 10 రేకుల ద్వారా రవాణా అవుతోంది."ఏరియా లక్ష్యాన్ని మణుగూరు మార్చి మొదటి వారంలోనే సాధిస్తుంది. బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ముందు ఉంది. కొన్ని గనులు ముందుగానే లక్ష్యాన్ని సాధిస్తాయి."వెంకటేశ్వరరెడ్డి, జీఎం




## భూ కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్యలోకి ఎంటర్..

నెల్లూరు : చంద్రయాన్ - 3 ప్రయోగంలో మరో కీలక ఘట్టం విజయవంతమైంది. భూ కక్ష నుంచి చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్ -3 ప్రవేశించింది. ఉపగ్రహంలోని ఇంధనాన్ని 28 నుంచి 31 నిమిషాలు పాటు మండించి లూనార్ అర్బిట్‌లోకి శాస్త్రవేత్తలు పంపించారు. చంద్రుని కక్షలోకి చంద్రయాన్ -3 చేరుకోవడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం చోటు చేసుకుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ గత నెల 14వ తేదీన చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించింది. చంద్రయాన్ -3 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ఎల్వీఎం-3 ఎం-4 రాకెట్ ప్రవేశపెట్టింది. చంద్రుని దక్షిణ ధ్రువంపై ఎవరూ చూడని నిగూఢ రహస్యాలను ఛేదించే చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) ఈ ప్రయోగానికి వేదికైంది. చంద్రయాన్ - 3 రాకెట్ ద్వారా 3,900 కిలోల బరువున్న చంద్రయాన్-3 పేలోడ్‌ను రోదసీలోకి పంపారు. రాకెట్ నుంచి విడిపోయాక వ్యోమనౌకను భూకక్ష్య నుంచి చంద్రుని కక్ష్య వరకూ మోసుకెళ్లే ప్రొపల్షన్ మాడ్యూల్, అక్కడి నుంచి చంద్రునిపై దిగిన తర్వాత పరిశోధనలు చేసేందుకు విక్రమ్ ల్యాండర్, ఉపరితలంపై తిరుగుతూ పరిశోధనలు చేపట్టే ప్రగ్యాన్ రోవర్ చంద్రయాన్-3లో ఉన్నాయి. ఇక ఈ వ్యోమనౌక దాదాపు 40 రోజులపాటు అంతరిక్షంలో ప్రయాణించి చివరికి ఆగస్టు 23 లేదా 24న చంద్రుడిపై దిగనుంది.




## మందు బాబులకు చంద్రబాబు గుడ్ న్యూస్

నంద్యాల: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మందు బాబులకు గుడ్ న్యూస్ చెప్పారు. మద్యం చార్జీలు తగ్గిస్తానని, మంచి మద్యం ఇస్తానని స్పష్టం చేశారు. సోమవారం నంద్యాల, నందికొట్కూరు బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... దేశంలోనే ఎక్కడా లేని విధంగా కరెంటు ఉత్పత్తిలో నూతన విధానాన్ని తీసుకొచ్చి కరెంటు చార్జీలు తగ్గిస్తానన్నారు.

యువగళంకు మంచి ఊపు వచ్చిందని, ఏ ఊరికి వెళ్లినా జాబ్ రావాలంటే బాబు రావాలని యువత అంటున్నారన్నారు. ఆరు నెలలు కష్టపడితే మీ జీవితాల్ని బాగు చేస్తానన్నారు. దేశంలోనే ఎక్కువగా రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఏడాదికి ఇరవై వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. సైకో ముఖ్యమంత్రి జగన్ తన వయసు గురించి, తన క్యారెక్టర్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'సింహంలా బతుకుతా.. శాశ్వతంగా సింహంలా ఉంటా'నని అన్నారు. రోజుకు 18 గంటలు పని చేస్తానని, ముందు ఇరవై ఏళ్లకు కావాల్సిన వాటిపై ఆలోచిస్తానని చెప్పారు. సీఎం జగన్ రోజుకు ఒక గంటైనా పని చేస్తున్నారా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ అమ్మ ఒడి ఇస్తామన్నారు. ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తానని, 2019లో సైకో జగన్ రాక పోయింటే ఏపీ, తెలంగాణకు సమానంగా అభివృద్ధి చెందేదన్నారు. నందికొట్కూరులో మాదిగలకు, బుడగ జంగాలకు న్యాయం చేస్తానని చెప్పారు. వాటర్ ట్యాంక్‌లలో బాంబులు పెట్టుకునే వైసీపీ నేతలు నందికొట్కూరు నియోజకవర్గంలో ఉన్నారని, వైసీపీ అంటే కరప్షన్ పార్టీగా అభివర్ణించారు. నీటి ఆవశ్యకత కోసం తాను చేపట్టిన ప్రాజెక్టుల యుద్ధం గురించి అందరికీ చెప్పాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## మంత్రి పెద్దిరెడ్డి అక్రమాలు, అవినీతిపై కేంద్రమంత్రి అమిత్ షాకు ఫిర్యాదు



న్యూఢిల్లీ: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి అవినీతి, అక్రమాలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ఫిర్యాదు చేశారు. మంగళవారం కేంద్రమంత్రిని రామచంద్రయాదవ్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు, సుమారు రూ.35 వేల కోట్ల అవినీతిపై ఆధారాలతో అమిత్ షాకి ఫిర్యాదు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాలుగేళ్లలో రూ.35 వేల కోట్ల దోపిడీ చేశారని ఆరోపించారు. పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ కంపెనీపై 160 క్రిమినల్ కేసులున్నాయన్నారు. 17 మంది డైరెక్టర్ల ద్వారా సూట్కేసు కంపెనీలు సృష్టించి అవినీతిని దాచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2019 ముందు ఉన్న ఆస్తుల వివరాలు పెద్దిరెడ్డి దాచిపెట్టారని తెలిపారు. పెద్దిరెడ్డిపై అమిత్ షాకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈడీ ద్వారా దర్యాప్తు జరిపి పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేశానన్నారు. ఎన్నికల సంఘానికి తప్పుడు అఫిడవిట్ ఇచ్చి మోసం చేశారని.. భవిష్యత్‌లో న్యాయపోరాటం చేస్తానని ఆయన అన్నారు. పెద్దిరెడ్డి తప్పుడు అఫిడవిట్ల పై ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఏపీలో ఇప్పుడున్న పార్టీల వల్ల ఉపయోగం లేదన్నారు. తమ పార్టీ వెనుక బీజేపీ లేదని.. బీజేపీ కోసం పనిచేసే వాడినైతే ఆ పార్టీలో చేరేవాడినని తెలిపారు. సుమారు 20 నిముషాలు అమిత్ షా తో భేటీ అయ్యానని.. అన్ని విషయాలు హోమ్ మంత్రికి వివరించినట్లు చెప్పారు. పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా ఉన్న అన్ని ఆధారాలు హోంమంత్రికి అందజేసినట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోపిడీకి ఏదీ అతీతం కాదన్నారు. 2019 నుంచి ఈరోజు వరకు కేవలం రెండు కార్యక్రమలు చేస్తున్నారని.. ఒకటి రాష్ట్ర సంపదని దోపిడీ చేయటం, లూటీ చేయటం.. రెండు ప్రజలు కోసం పోరాటం చేస్తున్న ప్రతిపక్షాలను వేధించటం అని విమర్శించారు. వేల లక్షల కోట్ల కుంభకోణాలు, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి అతని కుటుంబ సభ్యులు ఇసుక సహా అన్ని రంగాల్లో దోపిడీ చేస్తున్నారన్నారు. అవినీతితో సంపాదించిన డబ్బుతో వేల ఎకరాల భూములు కొన్నారన్నారు. పీఎల్ఆర్ కంపెనీకి ప్రభుత్వం నుంచి అక్రమంగా వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులు తీసుకుంటున్నారని మండిపడ్డారు. అవినీతి అక్రమాలతో వేల కోట్ల రూపాయలు దోచుకోవడం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చరిత్ర అంటూ వ్యాఖ్యలు చేశారు. ఒక్క మంత్రి రూ.35 వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారు అంటే.. మిగిలిన మంత్రుల పరిస్థితి ఏమిటి.. ముఖ్యమంత్రి జగన్ పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. సీఎం నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అన్ని రకాలుగా అవినీతికి పాల్పడుతూ రాష్ట్ర సంపదని లూటీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అన్ని రకాలుగా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజల ముందు పెట్టి అందుకు సంబంధించిన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎన్నికల్లో పోటీకి పెద్దిరెడ్డి అనర్హుడన్నారు. పెద్దిరెడ్డిని వెంటనే జగన్మోహన్ రెడ్డి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతిపరుడైన మంత్రి పెద్దిరెడ్డికి చిత్తూరు జిల్లా ఎస్పీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని రామచంద్రయాదవ్ వ్యాఖ్యలు చేశారు.

## అంతా చేసింది సీఎం జగనే.. పోలవరంపై బోండా ఉమా



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ నేత బోండా ఉమా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పోలవరంపై జగన్ రెడ్డి అసమర్థత పార్లమెంట్ సాక్షిగా అనేక సార్లు బయటపడిందన్నారు. జగన్ రెడ్డి పాలనలో ఎప్పటికీ పోలవరం పూర్తి కాదన్నారు. పోలవరాన్ని నాశనం చేసిన సీఎం జగనే అంటూ మండిపడ్డారు. పోలవరంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ అడిగిన సమాచారాన్ని కనీస అవగాహన లేని వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందన్నారు. పోలవరం ముంపు నిర్వాసితులకు నష్ట పరిహారం కూడా ఇవ్వలేకపోయారన్నారు.

పోలవరం ముంపు ప్రాంతాలు వరదలకు మునిగిపోతే కనీసం వాళ్లకు నిత్యావసర సరుకులను కూడా ప్రభుత్వం ఇవ్వలేక పోయిందని బోండా ఉమా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఆల్ టైమ్ రికార్డ్ సృష్టించిన టమాటా... ఏపీ, తెలంగాణాలో ధరలిలా!!

టమాటా ధర కిందికి దిగడం లేదు. ఆగస్టు నెలలో టమోటా ధరలు కిందికి దిగుతాయని భావిస్తున్నప్పటికీ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏపీ, తెలంగాణాలో టమాటా ధర ఆల్ టైం రికార్డును నమోదు చేసింది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మార్కెట్లో టమాటా ధర కిలోకు 200 రూపాయల రికార్డు ధర పలికింది. తెలంగాణ రాష్ట్రంలోనూ టమాటా ధర ఏకంగా 200 రూపాయలు పలికింది. నిన్న మొన్నటి వరకు 120 రూపాయలు ఉన్న టమాటా ధరను, టమాటా లకు డిమాండ్ ఎక్కువ ఉండడంతో, దొరకడం లేదన్న సాకు చూపి 200 రూపాయలకు అమాంతం పెంచేశారు. దీంతో కిలో 200 రూపాయలు పెట్టి టమాటాలను కొనుగోలు చేయాలంటే కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. సామాన్యులైతే టమాటాల వంక చూసేదే లేదు. ఇటీవల కాలంలో కురిసిన విపరీతమైన వర్షాలు టమాటా దిగుబడులపై ప్రభావం చూపడంతో పాటు డిమాండ్ కు తగినట్టుగా టమాటాల సరఫరా లేకపోవడంతో ప్రస్తుతం టమాటా ధరలు ఆల్ టైం రికార్డ్ ను సృష్టిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ టమాటా మంట మండిపోతుంది. టమాటాలను సాగు చేసిన రైతులు లక్షాధికారులు, కోటీశ్వరులు అవుతుంటే జనాలు మాత్రం టమాటాలను చూసి భయపడుతున్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మార్కెట్ టమాటాలకు ఫేమస్. అయితే మదనపల్లె మార్కెట్ కు తక్కువ మొత్తంలో టమాటాలు రావడంతో ధర పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. మదనపల్లె ప్రాంతంలో టమాటాల సీజన్ చివరి దశ కావడంతో పాటు, బయట ప్రాంతాల నుంచి దిగుబడి లేకపోవడంతో ధరలు గరిష్ట స్థాయిలో నమోదవుతున్నాయని తెలుస్తుంది. ఇటు తెలంగాణ రాష్ట్రంలోని మార్కెట్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. టమాటాలు తక్కువగా మార్కెట్ కు వస్తున్న పరిస్థితులు, వర్షాలకు టమాటా దెబ్బతిన్న పరిస్థితులు వెరసి టమాటాల ధరలు ఊహించని విధంగా పెరిగాయి. దేశ వ్యాప్తంగా టమాటా కు గిరాకీ ఎక్కువగా ఉండడంతో ఢిల్లీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్గఢ్ కు చెందిన వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మకాం వేసి టమాటాలను కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు.

## పార్లమెంట్‌లో పట్టువిడువని విపక్షం.. ఉభయ సభలు వాయిదా




ఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను మణిపుర్ అంశం కుదిపేస్తోంది. మణిపుర్‌పై చర్చతోపాటు, ప్రధాని ప్రకటనకు ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం మరోసారి ఉభయ సభలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి దిల్లీ ఆర్డినెన్స్‌పై ప్రకటన చేశారు. "బిల్లును హోంశాఖ నిబంధనలకు అనుగుణంగా రూపొందించింది. ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైందని కేజ్రీవాల్ బృందం గుర్తుంచుకోవాలి"అని అన్నారు. ఈ క్రమంలో మణిపుర్ అంశంపై చర్చకు ఇండియా కూటమి సభ్యులు పట్టుబడుతూ.. నినాదాలు చేయడంతో, సభను వాయిదా వేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటన చేశారు. రాజ్యసభలో సైతం ఇది పరిస్థితి తలెత్తింది. సభ ప్రారంభం కాగానే.. మణిపుర్ ఘటనపై చర్చ జరగాలని, ప్రధాని సభలో ప్రకటన చేయాలని ప్రతిపక్ష కూటమి సభ్యులు నినాదాలు చేశారు. ఒకే అంశంపై చర్చకు పట్టుబడుతూ సభకు అంతరాయం కలిగించొద్దని ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ విపక్ష సభ్యులకు సూచించారు. మణిపుర్ అంశంపై నిన్న చర్చ జరగాల్సి ఉందని, అది జరగలేదని తెలిపారు. ఈ క్రమంలో విపక్ష కూటమి సభ్యులు నినాదాలు చేస్తుండటంతో సభను వాయిదా వేశారు.

## బీసీలు పెయిడ్ ఆర్టిస్టులా జగన్ రెడ్డీ?.. వారి నాలుకలు తెగ్గోస్తాం




అమరావతి: ఎన్నికల సమయంలోనే ఏపీ సీఎం జగన్ రెడ్డికి బీసీలు గుర్తుకొస్తారా అని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీలు పెయిడ్ ఆర్టిస్టులా జగన్ రెడ్డీ అని ప్రశ్నించారు. బీసీలను పెయిడ్ ఆర్టిస్టులన్న వారి నాలుకలు తెగ్గోస్తామని హెచ్చరించారు. నారా లోకేష్ చేపట్టిన జయహో బీసీ చూసి వైసీపీ నేతల వెన్నులో వణుకు మొదలైందన్నారు. అక్కను వేధించారని ప్రశ్నించిన బీసీ విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను సజీవదహనం చేశారన్నారు.

జై చంద్రబాబు అన్నందుకు తోట చంద్రయ్యను హతమార్చిన దుర్మార్గులు వైసీపీ నేతలు అని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి యాదవులను వేధిస్తున్నారన్నారు. నాలుగేళ్లలో 60 మంది బీసీలను చంపేశారని.. 6 వేలమంది బీసీలపై తప్పుడు కేసులు పెట్టి హింసించింది నిజం కాదా? అని టీడీపీ ఎమ్మెల్సీ ప్రశ్నించారు. చంద్రబాబు తెచ్చిన రూ. 75 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. బీసీల ఉన్నతికి చంద్రబాబు ప్రవేశపెట్టిన 33 స్కీములను రద్దు చేశారన్నారు. చంద్రబాబు టీడీడీ ఛైర్మన్, ఈవో పదవులు, ఏపీఐఐసీ సహా ఎన్నో పదవులు బీసీలకిస్తే జగన్ రెడ్డి తన సామాజిక వర్గానికే కట్టబెట్టారన్నారు. జోగి రమేష్, కారుమూరి, విడదల రజనీ, మోపిదేవి వంటి పెయిడ్ ఆర్టిస్టులతో బీసీలను తిట్టిస్తారా అంటూ విరుచుకుపడ్డారు. టీడీపీ పొలిట్ బ్యూరోలో 60% బీసీలున్నారని... మరి వైసీపీలో ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. టీడీపీకి 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అయిన తనను ఓడించేందుకు జగన రెడ్డి ప్రయత్నించడం సిగ్గుచేటని పంచుమర్తి అనురాధ వ్యాఖ్యలు చేశారు.




విజయవాడ: కోడికత్తి కేసులో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. కేసును విజయవాడ నుంచి విశాఖ ఎన్ఐఏ కోర్టుకు బదిలీ చేస్తూ విజయవాడ ఎన్ఐఏ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఇప్పటి నుంచి కోడికత్తి కేసు విచారణ విశాఖ ఎన్ఐఏ కోర్టు చేపడుతుందని న్యాయమూర్తి వెల్లడించారు. ఇప్పటికే కేసులో 80 శాతం విచారణ పూర్తయిందని.. కేసులో ప్రత్యక్ష సాక్షి సీఎం జగన్ నేరుగా కోర్టులో హాజరై సాక్ష్యం చెబితేనే కేసు ముందుకు సాగుతుందని నిందితుడు తరపు న్యాయవాదులు వాదించారు. లేని పక్షంలో కేసు విచారణ మరింత జాప్యం జరిగే అవకాశం ఉందంటుని నిందితుడు శ్రీనివాసరావు తరపు న్యాయవాది అబ్దుస్ సలీం పేర్కొన్నారు.

విజయవాడ ఎన్ఐఏ కోర్టు నిర్ణయంతో కోడి కత్తి కేసు మరలా మొదటికి వచ్చిందని నిందితుడు తరపు న్యాయవాది అబ్దుస్ సలీం వాపోయారు. ప్రస్తుత సీఎం జగన్.. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయనపై విశాఖ ఎయిర్‌పోర్టులో కోడి కత్తితో దాడి జరిగింది. నిందితుడు శ్రీనివాసరావును అరెస్ట్ చేసి జైల్లో ఉంచారు. అప్పటి నుంచీ ఈ కేసుపై విజయవాడ ఎన్ఐఏ కోర్టులో విచారణ సాగుతూ వచ్చింది. తాజా నిర్ణయంతో ఇంకెన్ని రోజులు విచారణ జరుగుతుందోనని నిందితుడి తరుపు న్యాయవాదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## లెగ్స్ అందాలతో బిగ్ బాస్ పిల్ల స్టన్నింగ్ షో

బుల్లితెర హాట్ బ్యూటీల్లో అరియానా కూడా ఒకరు. మొదట యాంకరింగ్ తో తన కెరీర్ ని మొదలుపెట్టిన ఈ బ్యూటీ ఇప్పుడు అందరికీ పరిచయం అయ్యింది. చాలా సంవత్సరాలు యాంకర్ గా చేసినా రాని గుర్తింపు ఒక్కసారి డైరెక్టర్ ఆర్జీవీని ఇంటర్వ్యూ చేయడంతో వచ్చింది. అక్కడ ఆర్జీవీ ఆమెను పొగడటం, వెంటనే బిగ్ బాస్ లో ఆమెకు ఛాన్స్ రావడం వెంట వెంటనే జరిగిపోయాయి. ఇక ఎప్పుడైతే బిగ్ బాస్ లో అడుగుపెట్టి టాప్ 5కి చేరుకుందో, అప్పటి నుంచి మళ్లీ ఆమె వెనక్కి తిరిగి చూసుకుంది లేదు. ఫుల్ ఫేమస్ అయిపోయింది. కాగా, ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ప్రతిరోజూ ఒక్క ఫోటో అయినా షేర్ చేయకుండా ఉండలేదు. ఆమె షేర్ చేసే ఫోటోలన్నీ ఎక్కువ బోల్డ్ షోతోనే ఉంటాయి. నాకు నచ్చినట్లు నేనుంటా.. ఎవరు ఏమన్నా పట్టించుకోనే అనే స్వభావంతో ఉండే అరియానా క్లీవేజ్ షో విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గదు. తాజాగా బ్లాంక్ అండ్ వైట్ డ్రెస్ లో మెరిసింది. అంతకముందు చాలా సన్నగా ఇలియానా నడుములాగా ఉండేది, ఇప్పుడు కొంచెం బొద్దుగా మారింది. అలా బొద్దుగా మారి, తన థైస్ షో చేస్తోంది. అయితే, చాలా మంది అరియానా బొద్దుగా మారడం



జీర్ణించుకోలేకపోతున్నారు. పాత అరియానా నే బాగుంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. లైకుల వర్షం మాత్రం కురుస్తూనే ఉంది. ఇదిలా ఉండగా, బిగ్ బాస్ సీజన్ 4 తర్వాత ఈ బ్యూటీ చాలా బిజీగా మారింది. ఆ మధ్య ఓ వెబ్ సిరీస్ లోనూ నటించింది. ఆ తర్వాత మళ్లీ బిగ్ బాస్ ఓటీటీ షో ద్వారా అదరగొట్టింది. మధ్యలో అదే బిగ్ బాస్ లో యాంకరింగ్ చేసింది. మొన్నటి వరకు స్టార్ మాలో ఏదో ఒక ప్రోగ్రామ్ తో బిజీగా గడుపింది. ఇటీవల బీబీ జోడి తో తనలోని డ్యాన్సర్ ని కూడా బయటకు తీసింది. ఆ షో లో ఆమె రన్నర్ గా నిలడం విశేషం. ఇక, మళ్లీ బిగ్ బాస్ 7 మొదలవౌతుండటంతో, మళ్లీ అలియానా సందడి చేయడం గ్యారెంటీ అని తెలుస్తోంది. ఎక్స్ పోజింగ్ చేయడంలో ఎలాంటి మొహమాట పడని అరియాని కాస్త సినిమా ఆఫర్లు కూడా వస్తే మరింత రెచ్చిపోవడం గ్యారెంటీ. మధ్యలో రెండు, సినిమాల్లోనూ మెరిసింది కానీ, అది చిన్న రోల్స్ కావడం గమనార్హం. మరి ఈ బ్యూటీ బిగ్ బాస్ టీమ్ గుర్తించినట్లుగా, మూవీ డైరెక్టర్లు ఎప్పుడు గుర్తిస్తారో..!

## ఆమె వల్లే కెరీర్ లో ముందుకు వెళ్లలేక పోయా!

మహారాష్ట్రకు చెందిన జరీన్ ఖాన్ మోడల్ గా కెరీర్ ను ప్రారంభించి ఆ తర్వాత హిందీ, తమిళం, తెలుగు ఇంకా పంజాబీ భాషల్లో సినిమాలు చేసింది. తెలుగు లో చాణక్య సినిమాలో ఏజెంట్ జుబెదా పాత్రను పోషించిన జరీన్ ఖాన్ ఆకట్టుకుంది. ఆ సినిమా హిట్ అయ్యి ఉంటే తెలుగు లో ఈ అమ్మడికి వరుసగా ఆఫర్లు వచ్చి ఉండేవి. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం అయినా కూడా ఇంకా ఈ అమ్మడు అవకాశాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈమె నటించిన కొన్ని సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నా కూడా ఈమెకు ఎక్కువ ఆఫర్లు రాలేదు. అందుకు కారణం ఈమె కత్రీనా కైఫ్ మాదిరిగా ఉండటమే అంటూ బాలీవుడ్ వర్గాల టాక్. తాజాగా ఆ విషయమై జరీన్ ఖాన్ స్పందిస్తూ... కత్రీనా కైఫ్



తో నన్ను పోల్చడం వల్లే నా కెరీర్ ముందుకు సాగలేక పోయింది. నా సొంతం ప్రతిభను నిరూపించుకునేందుకు అది నాకు పెద్ద అడ్డంకిగా మారింది. ఆమె మాదిరిగా ఉన్నావు అంటూ నన్ను చాలా మంది ప్రశంసించినప్పుడు నాకు కూడా చాలా సంతోషంగా ఉంటుంది. కత్రీనా కైఫ్ కి నేను అభిమానిని. అందువల్ల ఆమె మాదిరిగా ఉన్నావు అన్నప్పుడు నాకు సహజంగానే ఆనందంగా ఉంటుంది. కానీ అదే కారణం వల్ల నేను ఇండస్ట్రీలో ఎక్కువ సక్సెస్ అవ్వలేక పోవడం విచారం కలిగిస్తుందని పేర్కొంది. ఇప్పటికైనా తన సత్తా ను చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నాను.. మంచి పాత్రల కోసం వెయిట్ చేస్తున్నాను అన్నట్లుగా జరీన్ ఖాన్ పేర్కొంది.




## ఎదురు చూపులకు తెర దించిన అల్లు కాంపౌండ్




2021 వ సంవత్సరంలో మలయాళ సినిమా ఇండస్ట్రీ నుండి వచ్చిన సూపర్ హిట్ చిత్రాల్లో నాయట్టు సినిమా ఒకటి. జోజు జార్జ్, కుంచాకో బోబన్, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఆ సినిమాకు మార్టిన్ ప్రక్కట్ దర్శకత్వం వహించాడు. ఆ సినిమా విడుదలైన వెంటనే టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ రీమేక్ రైట్స్ కొనుగోలు చేయడం జరిగింది. మలయాళంలో సూపర్ హిట్ అయిన నేపథ్యం లో తెలుగు రీమేక్ కోసం సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొదటగా ఈ రీమేక్ ను రావు రమేష్, అంజలి ప్రధాన పాత్రల్లో రూపొందించేందుకు చర్చలు జరిగాయి. కొన్ని సన్నివేశాల చిత్రీకరణ కూడా జరిగిందని సమాచారం. ఏం జరిగిందో ఏమో కానీ అల్లు అరవింద్ ప్రాజెక్టు మొత్తాన్ని మార్చేశారు. శ్రీకాంత్, శివాని రాజశేఖర్, వరలక్ష్మి శరత్ కుమార్ ముఖ్య పాత్రల్లో ఈ రీమేక్ ను ప్రారంభించడం జరిగింది. గత ఏడాది షూటింగ్ ప్రారంభం అయినా కూడా ఎలాంటి హడావుడి చేయకుండా సైలెన్స్ ను మెయింటెన్ చేయడం జరిగింది. ఎట్టకేలకు ఈ రీమేక్ ఎదురుచూపులకు తెర దించుతూ గీతా ఆర్ట్స్ వారు టైటిల్ ని రివీల్ చేయడం జరిగింది. కోట బొమ్మాళి అనే టైటిల్తో ఈ సినిమా తీసుకు రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మోషన్ పోస్టర్ ఆకట్టుకునే విధంగా ఉంది. మంచి కంటెంట్ సినిమా అన్నట్లుగా ఇప్పటికే జనాల్లో టాక్ మొదలైంది. తేజ్ మార్ని దర్శకత్వం లో ఈ రీమేక్ రూపొందుతోంది. ప్రస్తుతానికి సినిమా విడుదల తేదీ విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. కానీ ఇదే ఏడాది లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు గీతా ఆర్ట్స్ వారు ప్రయత్నాలు చేస్తున్నారట. ఒరిజినల్ వర్షన్ కు తెలుగు టచ్ ఇచ్చి రూపొందిస్తున్నట్లుగా తెలుస్తోంది.

## కేన్స్‌లో ప్రదర్శన కోసం 47 దుస్తులతో ఐష్ దిగింది కానీ!





మాజీ విశ్వసుందరి ఐశ్వర్యారాయ్ కి కేన్స్ ఫిలిం ఫెస్టివల్ తో ఉన్న అనుబంధం ఎలాంటిదో తెలిసిందే. 2002 నుండి ఐష్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరవుతోంది. అప్పటి నుండి దాదాపు అన్ని ఫెస్టివల్ ఎడిషన్‌లకు హాజరైంది. 2002లో కేన్స్‌లో మొదటిసారి కనిపించిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రజల హృదయాలను గెలుచుకుంది. ఐశ్వర్యరాయ్ 2003లో కూడా ఈ ఉత్సవానికి హాజరైంది. కానీ రెండోరి ప్రదర్శన తన రూపంపై తీవ్రంగా విమర్శలు వచ్చాయి. అయితే దీనిపై డిజైనర్ నీతా లుల్లా ఇప్పుడు ఓపెనయ్యారు. ఇటీవలి ఇంటర్వ్యూలో డిజైనర్ నీతా లుల్లా ఆ సంవత్సరం కేన్స్ ఈవెంట్లో ఐష్ ప్రదర్శనలో తప్పిదం గురించి వెల్లడించారు. వివిధ సందర్భాలలో ఐశ్వర్యతో 47 దుస్తులను పంపానని నీతాజీ వెల్లడించారు. కానీ రెండోసారి కేన్స్ ప్రదర్శనలో అక్కడ ఏదో తప్పు జరిగిందని తనపై విమర్శలు వచ్చాయని అన్నారు. నిజానికి తన పాదం ఫ్రాక్చర్ అయందని ఆ సమయంలో ఆరోగ్యం బాలేదని నీతాజీ గుర్తుచేసుకుంది. అయితే ఐష్ ధరించిన నియాన్ గ్రీన్ చీరలో ప్రదర్శనపై విమర్శలొచ్చాయి. తన ఫ్యాషన్ సెన్స్ ని తీవ్రంగా విమర్శించారు ఫ్యాషన్ పోలీసులు. అయితే మొత్తం పండుగకు ఐష్‌తో పాటు 47 దుస్తులు ఉన్నాయి. రోజంతా ఉపయోగించే దుస్తులు అందుబాటులో ఉన్నాయి.. ఉదయం దుస్తులు.. మధ్యాహ్నం దుస్తులు, సాయంత్రం దుస్తులు, రెడ్ కార్పెట్ దుస్తులు ఇలా వేలికవే ప్రత్యేకంగా డిజైన్ చేసాం. కానీ ఎక్కడో నేను ఊహించినది తేడా కొట్టింది. బహుశా టైమింగ్ సరిగా లేదు. ఒక్కోసారి దుస్తులకు తగ్గట్టు నగలు మార్చవలసి ఉంటుంది. అక్కడ ఏం జరిగిందో నాకు నిజంగా తెలియదు అని నీతాజీ చెప్పారు. ఆ సమయంలో తాను చాలా బాధపడ్డానని అయితే ఐశ్వర్య తనకు అండగా నిలిచిందని నీతా చెప్పింది. "చాలా మంది తోటి డిజైనర్లు మీడియా ఖచ్చితంగా ఏం జరిగిందో తెలియకుండా చేసే వ్యాఖ్యలతో ఎవరైనా కలత చెందుతారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటివరకు నాకు తెలియదు ... నాకు తెలిసినది మొదటి పేజీ .. రెండో పేజీ ఫీచర్లు మాత్రమే. నేను నిజంగా చెడ్డ డిజైనర్‌గా ఉన్నానో లేదా ఇంకేమైనా కానీ.. ఐశ్వర్యారాయ్ నా దుస్తులను ధరించి నన్ను విశ్వసిస్తోందని నేను భావించాను" అని నీతా లుల్లా చెప్పారు. స్టైలిస్టలందరూ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి తమ డిజైనర్లతో కలిసి వెళ్లేది ఎందుకంటే ఇలాంటివి జరగకుండా చూసేందుకేనని నీతా చెప్పారు. నీతా, ఐశ్వర్యల మధ్య సినిమాల్లో చాలా కాలం అనుబంధం ఉంది. 2007లో అభిషేక్ బచ్చన్‌తో ఐశ్వర్యరాయ్ పెళ్లి కోసం ఆమె కంజీవరం చీరను డిజైన్ చేసింది. ఆ చీరలో ఐష్ ముగ్ధ మనోహర రూపం అభిమానులను కట్టి పడేసింది.

## భోళాపై తమన్నా కాన్ఫిడెన్స్ ఏ లెవెల్లో ఉందంటే..

మెగాస్టార్ భోళా శంకర్ ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నాడు. ఈ ఏడాది మొదట్లో వాల్తేరు వీరయ్యతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు ఈ భోళా శంకర్ తో మరో హిట్ అందుకోవాలని అనుకుంటున్నారు. ఇప్పటికే ఈ మూవీ పై మంచి బజ్ క్రియేట్ అవుతోంది. మూవీ విడుదలకు దగ్గరపడుతుండటంతో, పాటలు విడుదల చేస్తూ, హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఈ మూవీలో చిరు సరసన ఈ మూవీలో చిరు సరసన మిల్కీ బ్యూటీ తమన్నా నటిస్తున్న విషయం తెలిసిందే. కాగా, ఈమూవీ వేదాళం మూవీకి రీమేక్ అన్న విషయం కూడా అందరికీ సుపరిచితమే. అయితే, రీమేక్ అనగానే ఫ్యాన్స్ చాలా భయపడ్డారు. రీమేక్ మూవీ అంటే, మక్కీటూ మక్కీ దింపి ఉంటారని చాలా మంది భావిస్తున్నారు.



ఈ క్రమంలో ఈ విషయంపై తాజాగా తమన్నా స్పందించింది. వేదాళం మూవీని సీన్ టూ సీన్ కాపీ చేయలేదని తమన్నా చెప్పడం విశేషం. దర్శకుడు మెహర్ రమేష్ ఈ మూవీని మొత్తం రీక్రియేట్ చేశారని, వేదాళం మూవీ చూసిన అనుభూతి కలగదు అని చెప్పింది. తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా, ఈ మూవీని తెరకెక్కించారని తమన్నా చెప్పింది. తమన్నా ఈ మాట చెప్పిన తర్వాత చాలా మంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ మూవీ పూర్తిగా సిస్టర్ సెంటిమెంట్ తో సాగుతుంది. ఈ మూవీలో చిరుకి సోదరిగా కీర్తి సురేష్ నటిస్తుండటం విశేషం. ఆగస్టు 11న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇటీవల ట్రైలర్ విడుదల చేయగా, అది ఆకట్టుకుంటోంది. మరి, ఈ మూవీ ప్రేక్షకులను ఎంత వరకు ఆకట్టుకుంటుందో చూడాలి. ఇక, ఈ మూవీ తర్వాత చిరు సోగ్గాడే చిన్ని నాయన ఫేమ్ కళ్యాణ్ కృష్ణ తో ఓ సినిమా చేస్తున్నారు. ఈ మూవిని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనుంది. నిర్మాతగా సుస్మిత పేరు మాత్రం ఉంటుందని తెలుస్తోంది. అయితే, తెర వెనుక పెట్టుబడి పెట్టి నడిపించేది అంతా పీపుల్ మీడియా ఫ్యాక్టరీనే అనే ప్రచారం జరుగుతోంది. గుడ్ విల్ పేరిట, లాభాల్లో కొంత వాటా సుస్మితకు ఇవ్వడానికి పీపుల్ మీడియా సంస్థ సుముఖంగా ఉందనే ప్రచారం జరుగుతోంది.

## ఫ్లాట్ పక్కనే శ్మశానం.. దెయ్యం మాంసం తినమంది!

బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'రాక్ స్టార్' సహాపలు క్రేజీ చిత్రాల్లో నటించిన నర్గీస్ ఫక్రీ పవన్ కల్యాణ్ 'హరిహరవీరమల్లు' చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమవుతోందన్న టాక్ ఉంది. ఈ బ్యూటీ ప్రస్తుతం %వాు%లో అరంగేట్రం చేస్తోంది. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమాల్లో నర్గీస్ ఒక భయానక అనుభవం గురించి ఓపెనైంది తన సినీ కెరీర్ ప్రారంభ రోజుల్లో ముంబైలోని 'హాంటెడ్' అపార్ట్‌మెంట్‌లో నివసించానని వెల్లడించింది. నర్గీస్ తనకు విచిత్రమైన కలలు వచ్చేవని ఆ కలలో ఒక దెయ్యం వెంటాడేదని గుర్తు చేసుకుంది. "నాకు అపార్ట్‌మెంట్ ఉంది. అది హిల్ రోడ్ (బాంద్రా) స్మశానవాటిక సమీపంలో ఉంది. ఆ ఫ్లాట్ లో ఉన్నంతకాలం నేను వింతైన కలలు కంటూనే ఉన్నాను. తెల్లవారుజామున 3 గంటలకు మేల్కొంటాను.. అప్పటికే దెయ్యం కలలు.. ఆ దెయ్యం చాలా పిచ్చిగా ఉంటుంది.



దెయ్యంలా కనిపించే 6 అడుగుల 5 ఇంచీల వ్యక్తి తెల్లగా లేతగా భయానకంగా కనిపిస్తాడు. అతను నన్ను స్మశానవాటికకు తీసుకువెళతాడు. అక్కడ తవ్వేవాడు. స్మశానవాటికలో అతని చేయి.. ఆపై మనుషుల ఎముకలను తీసి.. మాంసం తినమని నన్ను అడిగేవాడు... ఆ కల చాలా భయానకంగా ఉంది. వరుసగా నాలుగు రోజులు ఇవే కలలు" అంటూ నాటి భయానక కలల గురించి గుర్తు చేసుకుంది. నర్గీస్ ఓసారి బయటకు వెళ్లినప్పుడు ప్యాకింగ్ సమయంలో తన క్యాబినెట్‌లో 'ఆరు చనిపోయిన పిల్ల పక్షులు' కనిపించాయని కూడా గుర్తు చేసుకుంది. "అది విచిత్రం కాదా? అక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియదు అని తెలిపింది. తాను ఆ హాంటెడ్ హౌస్ ని వదిలి ఢిల్లీకి వెళ్లిపోయానని నర్గీస్ వెల్లడించారు. నర్గీస్ న్యూయార్క్‌లో జన్మించింది. యూరోప్ ఆగ్నేయాసియాలో నివసించింది. తర్వాత బాలీవుడ్ చిత్రాలలో నటించడానికి ముందు మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆమె ఇంతియాజ్ అలీ రాక్‌స్టార్‌తో నటిగా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత మెయిన్ తేరా హీరో, హౌస్‌ఫుల్ , బాంజో వంటి చిత్రాల్లో నటించింది.

# 466 అత్యవసర సేవల వాహనాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్





హైదరాబాద్: ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ఎమర్జెన్సీ సేవలను ప్రభుత్వం మరింత పటిష్ఠం చేస్తున్నది. ఇందులో భాగంగా హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా వద్ద 466 అమ్మ ఒడి, అంబులెన్స్, పార్థివదేహాల తరలింపు వాహనాలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జెండాఊపి ప్రారంభించారు. ఇందులో 204 అంబులెన్స్‌లు (108), 228 అమ్మఒడి వాహనాలు, 34 హర్సె వెహికిల్స్ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ వాణీ దేవి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనకు బయల్దేరారు.




లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో బుల్డోజర్లతో నేరస్థుల ఇళ్ల కూల్చివేతను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమర్థించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బుల్డోజర్లతో నేరస్థుల ఇళ్లను ఎందుకు కూల్చివేస్తోందని అడిగిన ప్రశ్నకు ఆయన ఘాటుగా స్పందిస్తూ.. అక్రమంగా ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించిన వారికి హారతి ఇవ్వాలా? అంటూ ప్రశ్నించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. నేరస్థులు, మాఫియాపై తమ ప్రభుత్వం చేస్తున్న ఈ ఆపరేషన్ సరైనదని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు అక్రమార్కులు ప్రభుత్వ ఆస్తులను ఇష్టారీతిగా ఆక్రమించుకున్నారని.. గత ప్రభుత్వాలు వారిపై చర్యలు తీసుకునేందుకు సాహసించలేదని మండిపడ్డారు. మైనారిటీ వర్గానికి చెందిన నేరస్థులనే లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టారని వచ్చిన ఆరోపణలను ఆయన తోచిపుచ్చారు. “దేశం రాజ్యాంగం ప్రకారం నడుస్తోంది. అందరికీ న్యాయం చేసేందుకు కోర్టులు ఉన్నాయి. ఇంతవరకు ఒక మైనారిటీ వచ్చి తనకు అన్యాయం జరుగుతోందని ఫిర్యాదు చేయలేదు. రాష్ట్ర ప్రజలందరికీ సమాన పరిపాలన, భద్రత అమలవుతోంది”అని అన్నారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వచ్చాక ఎలాంటి అల్లర్లు జరగలేదని.. ప్రశాంత వాతావరణం కొనసాగుతోందని వివరించారు. ఈ క్రమంలో తృణముల్ కాంగ్రెస్‌పై మండిపడ్డారు. ఆ పార్టీ దేశాన్ని మరో పశ్చిమ బెంగాల్‌గా మార్చాలనుకుంటోందని విమర్శించారు. “పశ్చిమ బెంగాల్‌లో గ్రామీణ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి వ్యక్తికి ఉంది” అని అన్నారు.

# హైదరాబాద్ నగరంలో పార్కింగ్ సమస్యకు ఎలా చెక్ పెడదాం.. సలహాలు కోరిన మంత్రి కేటీఆర్



పార్కింగ్ సమస్యను పరిష్కరించడం దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఒక సవాలుగా మారిందని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు పలు ఎంఎల్‌పీలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఎంఎల్‌పీలు ఇంకా చాలా చాలా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని బిపిన్ సక్సెనా అనే నెటిజన్ చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ ఈ విధంగా స్పందించారు. హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీ, న్యూసిటీస్‌లో పార్కింగ్ అనేది ప్రధాన సమస్యగా మారింది. సికింద్రాబాద్, ఓల్డ్ సిటీల్లోని మార్కెట్లకు దగ్గరలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి.. అందులో పార్కింగ్ కోసం బిల్డింగ్‌లను నిర్మించాలని బిపిన్ సక్సేనా అనే వ్యక్తి ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఈ మేరకు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే ఐడియాతో ఒక వీడియోను పోస్టు చేశారు. దీనికి స్పందించిన మంత్రి కేటీఆర్.. దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు పార్కింగ్ అనేది ప్రధాన సమస్యగా మారిందని అంగీకరించారు. పార్కింగ్ సమస్య తలెత్తకూడదనే.. కొత్తగా నిర్మించబోయే మెట్రో మార్గాల్లో పెద్ద ఎత్తున పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి పార్క్ అండ్ రైడ్ మోడ్‌ను ప్రయోగాత్మకంగా ప్రయత్నించబోతున్నామని వెల్లడించారు.

# బీజేపీ పాలిత రాష్ట్రాల్లో స్కాములు.. తెలంగాణలో స్కీములు: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో స్కాములు ఉంటే తెలంగాణలో స్కీములు ఉన్నాయని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడ చూసిన కొట్లాటలు, అవినీతి కనిపిస్తాయని విమర్శించారు. ఆరోగ్య రంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కరోనా కంటే పెద్ద జబ్బులు వచ్చినా రాష్ట్రం తట్టుకుంటుందని తెలిపారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో 466 అత్యవసర వాహనాలను ముఖ్యమంత్రి కేసీఆర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో కొత్తగా 466 వాహనాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడేనాటికి ప్రతి లక్ష జనాభాకు ఒక అంబులెన్స్ ఉండేదని, కాని ప్రస్తుతం 75 వేల మందికి ఒక 108 వాహనం అందుబాటులో ఉందని చెప్పారు. అమ్మఒడి వాహనాలకు నిధులు కావాలని కోరగానే ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేశారని వెల్లడించారు. జననం నుంచి మరణం వరకు వైద్య, ఆరోగ్యశాఖ సేవలు అందిస్తున్నదని చెప్పారు. వైద్యారోగ్య శాఖలో ఐదంచెల వ్యవస్థను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. తమ మంత్రిత్వ శాఖను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. కుటుంబ పెద్దగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలుచేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రం రాకముందు ప్రభుత్వ దవాఖానల్లో 30 శాతం ప్రసవాలు జరిగేవని, ఇప్పుడు ఆ శాఖ 70 శాతానికి పెరిగిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎన్నో ప్రైవేటు నర్సింగ్ హోంలు మూతపడ్డాయన్నారు. సర్కారు వైద్యంపట్ల ప్రజలకు నమ్మకం పెరిగిందని చెప్పారు. అమ్మఒడి వాహనాల ద్వారా ప్రతిరోజు 4 వేల మంది గర్భిణులకు సేవలు అందుతున్నాయని చెప్పారు. ఆశావర్కర్ల సెల్‌ఫోన్ బిల్లులను ఇకపై ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి హరీశ్ అన్నారు. వారికి స్మార్ట్‌ఫోన్లు ఇవ్వాలని సర్కారు నిర్ణయించిందని చెప్పారు. అంబులెన్సులను డైనమిక్ పొజిషన్ చేయాలని అనుకుంటున్నామని వెల్లడించారు. 108 ఉద్యోగులకు నాలుగు స్లాబులుగా వేతనాలు పెంచనున్నామని చెప్పారు.

# బీజేపీకి తోక పార్టీ అనేలా కాంగ్రెస్ ప్రవర్తన



సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీ బీజేపీకి తోక పార్టీ అనేది నిజమనేలా కాంగ్రెస్ ప్రవర్తిస్తోందని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వరదలను రాజకీయం చేస్తున్న బురద ప్రతిపక్ష నాయకులు అంటూ మండిపడ్డారు.

వరదలపై కేసీఆర్ అనుక్షణం పర్యవేక్షించారన్నారు. ఇంత వర్షంలో కూడా ఎక్కడా కరెంట్ పోకుండా చేశామన్నారు. వరద సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు చేపట్టామన్నారు. నాలుగేళ్ళ నుంచి వరదలు వస్తున్నా బీజేపీ పట్ల భక్తిని చాటుతూ బీజేపీ ఏజెంట్లలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని తెలిపారు. గుజరాత్‌లో రాని వరదలకు నిధులు ఇచ్చే కేంద్రం తెలంగాణాకు మాత్రం ఒక్క పైసా ఇవ్వడంలేదన్నారు. వరదలపై మూడు సార్లు కేంద్ర బృందాలు వచ్చి పరిశీలించినా పైసా నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. కాంగ్రెస్ వ్యవహారం బీజేపీకి అనుకూలమని మరోసారి స్పష్టం అవుతోందని మంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.



# ఎన్నిక వివాదం.. మంత్రి కొప్పుల పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్: తన ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించాలని కోరుతూ తెలంగాణ మంత్రి కొప్పుల ఈశ్వర్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. ధర్మపురి నియోజకవర్గం నుంచి అక్రమ పద్ధతుల్లో కొప్పుల ఈశ్వర్ గెలిచారని.. ఆయన ఎన్నిక చెల్లదంటూ ప్రకటించాలని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 2018లో పిటిషన్ దాఖలు చేశారు. ఈశ్వర్ స్థానంలో తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని కోరారు. లక్ష్మణ్ దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించాలంటూ కొప్పుల ఈశ్వర్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఆ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.




## ఇక్కడ వీళ్లను అర్సుకోవడానికి టైం లేదు కానీ.. అంటూ కేసీఆర్‌పై విమర్శల వెల్లువ

హైదరాబాద్ : జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని తపిస్తోన్న తెలంగాణ సీఎం కేసీఆర్.. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. అప్పటి నుంచి పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరించడంపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా మహారాష్ట్రపై మరింత ఎక్కువగా ఫోకస్ పెట్టారు. మహారాష్ట్రలో మాత్రం జాయినింగ్స్ పేరిట కేసీఆర్ హడావిడి చేశారు. ఇప్పటికే అక్కడ పలు చేరికల సభలు నిర్వహించారు. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం పార్టీ తరుపున అభ్యర్థులను నిలబెట్టారు. వారిలో ఏ ఒక్కరూ విజయం సాధించలేదనుకోండి అది వేరే విషయం. ఇక మరోసారి నేడు ఆయన మహారాష్ట్రలో పర్యటిస్తున్నారు.

పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు ఎక్కడ తిరిగినా ఏమీ లేదు కానీ తెలంగాణలో పరిస్థితులు సరిగా లేనపుడు పక్క రాష్ట్రాల పర్యటనలంటే ప్రజల నుంచి ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతాయి. ప్రస్తుతం ఇదే జరుగుతోంది. తెలంగాణలో బీభత్సంగా వర్షాలు కురిసి అతలాకుతలం అయిపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి అయితే నామరూపాల్లేకుండా పోయింది. ఇక ఇటు ములుగు జిల్లాలోని కొండాయి గ్రామం పరిస్థితి కూడా దాదాపు అంతే. ఇలా చాలా ప్రాంతాలున్నాయి. కానీ ఏ ఒక్కచోటకూ సీఎం కేసీఆర్ వెళ్లింది లేదు. ఏ ఒక్కరినీ పకలరించిన పాపాన పోలేదు. కానీ ప్రస్తుతం మహారాష్ట్ర పర్యటనకు మాత్రం వెళుతున్నారు. దీంతో నెట్టింట పెద్ద ఎత్తున కేసీఆర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. “ఇక్కడ జరిగిన వరదల్లో ప్రజలు కష్టాలు పడుతుంటే వీళ్ళను అర్సుకోడానికి సారుకు టైం దొరకలేదు కానీ మహారాష్ట్రకు పోయి అక్కడ రాజకీయాలు చేస్తుండు ఇలాంటి నాయకులను ఏమనాలి? భూపాలపల్లి ములుగు జిల్లాల్లో ప్రజలు అరిగోస పడుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు చెయ్యాలా సహాయం? ప్రభుత్వం చెయ్యదా?” అని ట్విటర్ వేదికగా మండిపడుతున్నారు.

# కేసీఆర్ ప్రజల ప్రాణాలు గాలికి వదిలేశారు..




న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ప్రాణాలు గాలికి వదిలేశారని అధికారిక లెక్కల ప్రకారం వరదల్లో 40 మంది చనిపోయారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, వరదల వల్ల రూ. 5 వేల కోట్ల నష్టం సంభవించిందన్నారు. సీఎం కేసీఆర్ అఖిలపక్షాన్ని తీసుకుని ఢిల్లీ వచ్చి ప్రధాని మోదీ, హోంమంత్రిని కలిసి నిధులు విడుదల చేయమని అడగాలని సూచించారు. బీఆర్ఎస్ ఎంపీలు ఎందుకు పార్లమెంట్‌కు వస్తున్నారో తెలియడం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. చనిపోయిన వారికి రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలని, పంటలు నష్టపోయిన వారికి ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 5 వేల కోట్ల నష్టం జరిగిందంటూనే రూ. 500 కోట్లు కేటాయించారని, వరదలతో రైతులు నష్ట పోతే కేసీఆర్ రాజకీయాలు చేయాల్సిన సందర్భం ఇదా? మానవత్వం ఉన్నవారు ఇలాంటి రాజకీయాలు చేస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణ సొమ్ముతో మహారాష్ట్రలో రాజకీయాలు చేస్తున్నారని విర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లకుండా సిగ్గులేకుండా మహారాష్ట్రకు వెళ్లి పార్టీ ఫిరాయించిన వారికి కండువా కప్పుతున్నారన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వచ్చి వరద నష్టంపై కేంద్రానికి నివేదిక ఇవ్వాలన్నారు. కేంద్రం తెలంగాణను ఆదుకోకపోతే పార్లమెంట్‌ను స్తంభింపజేసీ వరద సహాయం సాధిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# కొల్హాపూర్ ఆలయంలో కేసీఆర్ ప్రత్యేక పూజలు

కొల్హాపూర్: తెలంగాణ సీఎం కేసీఆర్ మహారాష్ట్రలో పర్యటిస్తున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి కొల్హాపూర్ చేరుకున్న సీఎంకు స్థానిక భారాస నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ మహాలక్ష్మి స్వరూపమైన అంబబాయి అమ్మవారిని కేసీఆర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంగ్లి జిల్లాలోని వాటేగావ్‌లో ప్రముఖ సంఘ సంస్కర్త దివంగత అన్నాభావూ సాఠే 103వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత కేసీఆర్ తిరిగి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.

# ఆ వెయ్యి కోట్ల హామీ ఏమైంది కేసీఆర్?



భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం లో గత వరదల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన వెయ్యి కోట్ల హామీ ఏమైందని కాంగ్రెస్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న స్థితే తెలంగాణాలో ఉందన్నారు. ముఖ్యమంత్రికి హామీలు తప్ప అమలు చేయటం రాదని విమర్శించారు. నిధుల ప్రకటన, మాట ఇవ్వటం మరచిపోవడం కల్వకుంట్ల కుంటుంబానికి అలవాటని సెటైర్ విసిరారు. ఎన్నికల దృష్టితో ఆర్టీసీపై ప్రకటన, గతంలో ఉద్యమించిన ఆర్టీసీ కార్మికులను కేసీఆర్ వేధించిన తీరు కార్మికులు మరిచిపోలేరని.. ఆర్టీసీ విలీనాన్ని కాంగ్రెస్ కోరుకుంటోందన్నారు. తెలంగాణలో వరదలతో జనం తల్లడిల్లిపోతుంటే పక్క రాష్ట్రం మహారాష్ట్ర వెళ్లి అక్రమ సొమ్ముతో ఫిరాయింపుల ప్రోత్సాహం.. ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవుపలికారు. వరద బాధితులకు కాంగ్రెస్ కార్యకర్తలు అండగా నిలుస్తారని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com